

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
శుక్రవారం | 10 నవంబర్ 2023 | www.navatelangana.com

ఓటమి భయంతోనే ఐటీ దాడులు

పాలేరు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాసరెడ్డి

- క్యాంపు కార్యాలయం నుండి భారీ ర్యాలీగా వెళ్ళి నామినేషన్



8లో...

ఆత్మీయ బంధువు కేసీఆర్

- బీఆర్ఎస్ పాలేరు అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి
- భారీ మెజార్టీతో గెలిపించాలి



8లో...

బూర్జువా పార్టీలను ఓడించాలి





- అవకాశవాద రాజకీయాలను తిప్పికొట్టాలి
- సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు
- డబ్బు..పోరాటాలకు మధ్య పోటీ: బి.వెంకట్
- భారీ జనసందోహంతో
- సీపీఐ(ఎం) అభ్యర్థుల నామినేషన్
- బహిరంగసభకు భారీగా హాజరైన ప్రజలు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

అవకాశవాద రాజకీయాలు చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ తదితర బూర్జువా పార్టీలను ఓడించి, ప్రజా పోరాటాలు చేసే కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. పార్టీ జాతీయ నాయకులు బి.వెంకట్‌తో కలిసి ఖమ్మంలోని పెవిలియన్‌గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన బహిరంగసభలో ప్రసంగించారు. సీపీఐ(ఎం) పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల అభ్యర్థులు తమ్మినేని వీరభద్రం,

మిగతా 3లో...


ఇల్లందులో బీఆర్ఎస్ పార్టీకి షాక్

- మున్సిపల్ చైర్మన్ డివి, ఎంపీపీ, కౌన్సిలర్లు, సర్పంచులు రాజీనామా
- తుమ్మల సమక్షంలోచేరిక

3లో...



ఏ పార్టీ అయితేనేమి టికెటే లక్ష్యం





9వ సారి ఎన్నికల బరిలో వనమా

- 4 పర్యాయాలు ఓటమి.. 4 సార్లు విజయం
- 4 సార్లు కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపైనే విజయం
- తొలిసారిగా కారు గుర్తుపై ఎన్నికల బరిలో
- నేడే వనమా నామినేషన్ దాఖలు
- వనమా వెంకటేశ్వరరావుకు కొరకరానికి కొయ్యగా తనయుడి వ్యవహారం..? • కారు గుర్తును ఓటర్లు ఆదరించేనా..?

8లో...

నవతెలంగాణ
ఖమ్మం
శుక్రవారం | నవంబర్ 10 2023 | www.navatelangana.com

'ఎర్రబోయిన' హత్య కేసులో నిందితుడు కొత్తపల్లి వినయ్ అరెస్ట్

నవతెలంగాణ-బోనకల్

సీపీఐ(ఎం) కార్యకర్త ఎర్రబోయిన నాగేశ్వరరావు హత్య కేసులో నిందితుడు కొత్తపల్లి వినయ్‌ని అరెస్టు చేసి మధిర కోర్టులో హాజరపరిచినట్లు మధిర సీఐ జానోట్ వసంతకుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) కార్యకర్త ఎర్రబోయిన నాగేశ్వరరావు అక్టోబర్ 26వ తేదీన కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడిన సంగతి విధితమే. ఖమ్మంలోనే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతూ గత నెల 28వ తేదీన ఎర్రబోయిన నాగేశ్వరరావు మృతి చెందారు. గోవిందాపురం ఎల్ గ్రామ ఉపసర్పంచ్ కారంగుల చంద్రయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నాగేశ్వరరావు హత్య కేసులో ఇటీవల 15 మందిని అరెస్టు చేసి మధిర కోర్టులో హాజరపరిచారు. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన కొత్తపల్లి వినయ్ ఎర్రబోయిన నాగేశ్వరరావు సంఘటన జరిగిన దగ్గర నుంచి పరారీలో ఉన్నాడు. ఎట్టకేలకు కొత్తపల్లి వినయ్‌ను గురువారం అరెస్టు చేసి మధిర కోర్టులో హాజరపరిచినట్లు సీఐ వసంత కుమార్ తెలిపారు. దీంతో ఎర్రబోయిన నాగేశ్వరావు హత్య సంఘటనలో నిందితుల అందరిని పోలీసులు అరెస్టు చేశారు.

పెన్షనర్లని కలిసిన బీవీ రాఘవులు

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం అల్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులను సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘువులు కలిశారు. ఖమ్మంలోని సీపీఐ(ఎం) అభ్యర్థుల నామినేషన్‌కు వచ్చిన ఆయన పక్కనే ఉన్న పెన్షనర్ కార్యాలయానికి వెళ్లి వారు చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. వారి ఆరోగ్యం పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎల్. గోపి, కళ్యాణ నాగేశ్వరావు, సీనియర్ నాయకులు ఎస్డి జియావుద్దీన్, మాధవరావు, స్వామి, వీరభద్రం, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

గాంధేయవాది కొనకండ్ల మృతి

నవతెలంగాణ-కారేపల్లి

పేదల సమస్యలపై గాంధేయ మార్గంలో పోరాటాలు జరిపిన కారేపల్లికి చెందిన గాంధేయవాది కొనకండ్ల సత్యనారాయణ(72) బుధవారం రాత్రి కన్నుమూశారు. కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో పోరాడుతూ మృత్యువాత పడ్డారు. కారేపల్లిలో ప్రజా సమస్యలపై గాంధేయ మార్గంలో ప్రభుత్వం భూమి కాపాడటం, సింగరేణి కాలరీస్ షేఫ్ నిధులు రప్పించటం, రహదారుల నిర్మాణం, అవినీతికి వ్యతిరేకంగా, పేదల సమస్యలపై పట్టువదలకుండా నిరహార దీక్షలు చేసి వాటికి పరిష్కారం చూపారు. తన దృష్టికి వచ్చిన ఏ సమస్యనైనా పరిష్కారం దొరికే వరకు మొండి పట్టుతో పోరాడే వారు. కొనకండ్ల భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్, టీపీసీసీ ఉపాధ్యక్షులు మాలోత్ రాందాస్‌నాయక్, పగడాల మంజుల, తలారి చంద్రప్రకాశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పెద్దబోయిన ఉమాశంకర్, సీపీఎం నాయకులు తలారి దేవప్రకాష్, కోటమైసమ్మ తల్లి ఆలయ చైర్మన్ డాక్టర పర్సా పట్టాభిరామారావు తదితరులు నివాళ్లు అర్పించారు.

సీపీఐ శ్రేణులతో భట్టి విక్రమార్క భేటీ

నవతెలంగాణ - బోనకల్

కాంగ్రెస్ మధిర నియోజకవర్గ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క గురువారం సిపిఐ నాయకులతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ సిపిఐ కాంగ్రెస్, టిజెఎస్ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు సిపిఐ బోనకల్ మండల సమితి కృషి చేయాలని ఆయన సిపిఐ శ్రేణులను కోరారు. మండలంలోని జానకీపురం గ్రామంలో సిపిఐ ముఖ్యనాయకుల భేటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి గ్రామంలో సమన్వయ కమిటీలను సిపిఐ, కాంగ్రెస్ పార్టీలు ఏర్పాటు చేసి, కార్యకర్తలను సానుభూతి పరులను సమన్వయ పరుచుకుంటూ వెళ్లాలని సూచించారు. ఆయా గ్రామాల వివరాలను, పరిస్థితులను సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్, జక్కుల రామారావు, ఏనుగు రవికుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు ఆకెన పవన్, వల్లెబోయిన వీరభద్రం పాల్గొన్నారు.

మదన్‌లాల్‌ను గెలిపించాలి

నవతెలంగాణ-కొణిజర్ల

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాణోత్ మదన్ లాల్ నామినేషన్ విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని, హాజరై ప్రతి కార్యకర్తకు నాయకులు కిలారి కిరణ్ కృతజ్ఞతలు తెలిపారు. మదన్ లాల్ గెలుపు కోసం ఐక్యంగా కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

అందుబాటులో ఉండే వ్యక్తి కావాలా? హైదరాబాదులో ఉండే వ్యక్తి కావాలా?

మధిర బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్ రాజు

నవతెలంగాణ - బోనకల్



ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే వ్యక్తి కావాలా? హైదరాబాదులో ఉండే వ్యక్తి కావాలా? ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని టిఆర్ఎస్ మధుర నియోజకవర్గ అభ్యర్థి లింగాల కమల్ రాజు కోరారు. మండల పరిధిలోని తూటికుంట్ల, లక్ష్మీపురం, గార్లపాడు గ్రామాలలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొండ బాల కోటేశ్వరరావుతో కలిసి కమల్ రాజు గురువారం రాత్రి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభలలో ఆయన మాట్లాడుతూ కారు గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే కెసిఆర్ సహకారంతోనే మధిర నియోజకవర్గ వ్యాప్తంగా కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు పూర్తి చేసుకున్నాం అన్నారు. రాష్ట్రంలో మళ్లీ అధికారం బీఆర్ఎస్ పార్టీదే అని హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ చరిత్ర సృష్టిస్తారన్నారు. తిరిగి మళ్లీ అధికారంలోకి రాగానే అర్హులైన పేద మహిళలందరికీ రూ.400 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. అలానే కేసీఆర్ భీమా ప్రతి ఇంటికి ధీమా కింద రూ 5 లక్షల రూపాయల వరకు బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. సౌభాగ్య లక్ష్మి పథకం కింద అర్హులైన మహిళలందరికీ రూ.3000 వేల రూపాయలు జీవన భృతి అందిస్తామని పేర్కొన్నారు ఆరోగ్య రక్ష కింద రూ.15 లక్షల రూపాయల వరకు ఆరోగ్యశ్రీని వర్తింప చేస్తామని తెలిపారు. రైతుబంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ లాంటి ఎన్నో అద్భుతమైన సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచే విధంగా పరిపాలనందించినటువంటి ఘనత కేసిఆర్‌కే దక్కుతుందన్నారు, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 24 గంటలు పాటు విద్యుత్ సరఫరా అందించిన రాష్ట్రం ఒక తెలంగాణ మాత్రమే అన్నారు. కారు గుర్తుపై ఓటు వేసి అభివృద్ధి, సంక్షేమంలో దేశానికి ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రాన్ని నిల్పిన కేసీఆర్‌కి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బట్టి విక్రమార్క చేసింది శూన్యమన్నారు. మంచినీళ్ల కోసం వెళ్లిన మహిళలపై సాగునీటి కోసం ఆందోళన చేసిన రైతులపై కేసులు పెట్టించిన ఘనత బట్టి విక్రమార్క దేనిని ఘాటుగా విమర్శించారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జున్ రావు మండల ప్రధాన కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు నాయకులు మంకెన రమేష్ చావా హనుమంతరావు బంధం శ్రీనివాసరావు వేమూరి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో

నవ తెలంగాణ- ఖమ్మంరూరల్



పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇంట్లో, కార్యాలయాల్లో ఐటీ, ఈడీ అధికారులుసోదాలు చేపట్టడాన్ని నిరసిస్తూ మండలంలోని టీఎన్జీవోస్ కాలనీ వద్ద ఖమ్మం-వరంగల్ ప్రధాన రహదారిపై కాంగ్రెస్ నాయకులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. సాయిగణేశ్ నగర్‌లోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో కూడా అధికారులు సోదాలు చేస్తున్న విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. తరువాత రాస్తారోకో చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కల్లెం వెంకటరెడ్డి, అజ్మీర అశోక్‌నాయక్, భూక్యా సురేష్‌నాయక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలోని వల్లభి, పెద్దమండవ, గోకినేపల్లి ఉన్నత పాఠశాలల్లో ఓటు హక్కు వినియోగంపై గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి విడివి అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, వినియోగించే ఓటు హక్కును నిజాయితీగా వేయాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురి కాకూడదన్నారు. భావిభారత విద్యార్థులు ఓటు హక్కు వినియోగంపై తల్లిదండ్రులు, నిరక్షరాస్యులను చైతన్యం పరచాలన్నారు. కార్యక్రమంలో ఎంపిఓ పి.సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు ఎస్కె ఇంతియాజ్, మల్లారపు వెంకటేశ్వర్లు, పి.సతీష్ బాబు, ప్రజ్వల యువజన సంఘం అధ్యక్షులు చింతమాల పాపయ్య పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం

డెంగ్యూ కేసులతో అల్లాడుతున్న ప్రజలు

నవతెలంగాణ-వేంసూరు

గ్రామాలలో పారిశుద్ధ్యం పడకేసింది. ఎన్నికల హడావుడిలో సర్పంచులు ఉండటం గ్రామ పంచాయతీలపై సంబంధిత అధికారి పర్యవేక్షణ లేకపోవడంతో పారిశుద్ధ్య పనులు నామమాత్రంగా కొనసాగుతున్నాయి. దీంతో గ్రామాల్లో దోమలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. ప్రతి ఇంట్లో జ్వరాల బారిన పడ్డవారు ఉన్నారు. ఫాగింగ్ చేసిన దాఖలాలు లేవు. డ్రై డే కార్యక్రమాన్ని మరిచారు. మండల కేంద్రంలో గత వారం రోజుల్లో డెంగ్యూతో ముగ్గురు మరణించారు పిహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరాలు అరకొరగా నిర్వహిస్తున్నప్పటికీ జ్వరాలు అదుపులోకి రావడం లేదు.

11న ఎర్రబోయిన నాగేశ్వరరావు సంస్మరణ సభ

నవతెలంగాణ - బోనకల్



మండల పరిధిలోనే గోవిందపురం ఎల్ గ్రామానికి చెందిన సిపిఎం కార్యకర్త ఎర్రబోయిన నాగేశ్వరరావు కాంగ్రెస్ గుండాల దాడిలో మృతి చెందిన సంగతి విధితమే. సిపిఎం గోవిందాపురం ఎల్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన సంస్మరణ సభ నిర్వహించనునట్లు సిపిఎం శాఖా కార్యదర్శులు ఏడు నూతల లక్ష్మణరావు, బండి చంద్రరావు, లక్ష్మీపురం సొసైటీ అధ్యక్షులు మాదినేని వీరభద్రరావు, లక్ష్మీపురం ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత తెలిపారు. ఈ సంస్మరణ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు హాజరవుతారని వారు తెలిపారు.ఈ సంస్మరణ సభకు సిపిఎం నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

ప్రధానోపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలోని వివిధ పాఠశాల నుండి బదిలీ అయిన ప్రధానోపాధ్యాయులు, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముదిగొండలో గురువారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో మండల విద్యాశాఖ అధికారి బివి రామాచారి మాట్లాడుతూ విద్య అభివృద్ధికి నిరంతరం పాటుపడే ఉపాధ్యాయులు లోపం లేకుండా కృషి చేస్తారో వారు ఎక్కడైనా రాణిస్తారన్నారు. బదిలీ అయిన ప్రధానోపాధ్యాయులు కె శాంతి, ఇవి రామిరెడ్డి, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు దశరథ్, బదిలీ అయిన ఉపాధ్యాయునిలు కల్పవల్లి, అనిత, ప్రేమలత గణితం బోధించి అత్యధిక మార్కులు రావడానికి కారణమైన సీఆర్పీ నరసింహారావును శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పరిశ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య హైస్కూల్లో రాగి జావ తాగటానికి విద్యార్థిని,విద్యార్థుల అందరకు స్టీల్ పాత్రలను విరాళంగా అందజేశారు.

దామాషా ప్రకారం నామినేట్ పదవులకు అవకాశం కల్పించాలి

ఆత్మీయ సమ్మేళనంలో దూదేకుల నూర్ భాషా ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ సయ్యద్ భాష

నవతెలంగాణ- ఖమ్మం



దూదేకుల కులం దామాషా ప్రకారం రావలసిన రాజకీయ నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని దూదేకుల నూర్ భాషా ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ సయ్యద్ భాష డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో దూదేకుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూదేకుల కులానికి రాజకీయ నామినేట్ పదవుల్లో అవకాశం కల్పించాలని, ఉర్దు అకాడమీ, హజ్ కమిటీల్లో మున్సిపల్ కో-ఆప్షన్ పదవులు అవకాశం కల్పించాలన్నారు. బిసి రిజర్వేషన్ సాధించేంతవరకు విశ్రమించేది లేదని, దానికోసం ఎంతవరకైనా ముందుకెళ్తామని అన్నారు. రాష్ట్రంలో ఉన్న 119 నియోజకవర్గాల్లో ఉన్న అన్ని పార్టీల అభ్యర్థులకు దూదేకుల డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాలు అందజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ లాల్ జాన్ పాష, జాయింట్ సెక్రెటరీ షేక్ నందా మియా ,రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు షేక్ జానీ బేగం, జిల్లా అధ్యక్షురాలు షేక్ షకీనాబీ, బీసీ ఫెడరేషన్ కులాల అధ్యక్షులు దుర్గారావు, ప్రధాన కార్యదర్శి యుగంధర్, నల్లగొండ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఇల్లందులో బీఆర్ఎస్ పార్టీకి షాక్

- మున్సిపల్ చైర్మన్ డివి, ఎంపీపీ, కౌన్సిలర్లు, సర్పంచులు రాజీనామా
- తుమ్మల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక చందాలు, దందాలు, అవినీతి,
- అరాచక బీఆర్ఎస్ పార్టీని వదిలేసాం
- ఓటమి భయంతోనే దౌర్జన్యాలు, అక్రమ కేసులు
- విలేకరుల సమావేశంలో తుమ్మల

నవతెలంగాణ-ఇల్లందు

నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. గత ఏడాదిగా ఎమ్మెల్యే హరిప్రియ హరిసింగ్ నాయక్‌తో విభేదిస్తూ బీఆర్ఎస్ టికెట్ ఇవ్వొవద్దంటూ అధిష్టానం పై తీవ్ర ఒత్తిడి తెస్తూ వచ్చిన మున్సిపల్ చైర్మన్ డివి ఎట్టకేలకు పార్టీని వీడారు. మున్సిపల్ చైర్మన్ డివి నివాసంలోనే గురువారం మాజీ మంత్రి తుమ్మల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ ఇల్లందు అభ్యర్థి కోరం కనకయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరితోపాటు ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, జిల్లా నాయకులు ఆమె భర్త జానీ, మరో నలుగురు కౌన్సిలర్లు, సర్పంచులు ఉన్నారు. వీరందరికీ కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి తుమ్మల మాట్లాడారు. జిల్లా అభివృద్ధి కోసం గోదావరి జలాలతో సస్య శ్యామలం చేయాలని నాడు టీఆర్ఎస్‌లో చేరాం. నాతో పాటు వేలాది మంది పార్టీలో చేరారు. పార్టీ పెద్దలే ఓడించాలని చూసారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి పాటు పడ్డా. తెలంగాణ కల సాకారం



చేసిన సోనియమ్మ రాహుల్ గాంధీ నాయకత్వం పై విశ్వాసం తో కాంగ్రెస్ లో చేరామని వారు తెలిపారు. ఇల్లందు మున్సిపల్ చైర్మన్‌గా డీవీ అభివృద్ధికి పాటుపడ్డారని తుమ్మల తెలిపారు. నన్ను నమ్మి కాంగ్రెస్ పార్టీలో చేరిన మున్సిపల్ చైర్మన్ డీవీకి కాంగ్రెస్‌లో భవిష్యత్ బాధ్యత నాది అన్నారు. ఇల్లందు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోరం కనకయ్య ను గెలిపించాలని తుమ్మల పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అనసూర్య పట్టణ, మండల అధ్యక్షులు దొడ్డా డానియెలు, పులి సైదులు, ప్రధాన కార్యదర్శులు మహ్మద్ జాఫర్, అరెం కిరణ్, జిల్లా నాయకులు జానీ భాయ్, మున్సిపల్ కౌన్సిలర్ పత్తి స్వప్న, సర్పంచులు పాయం స్వాతి, పాయం లలిత, కల్తీ పద్మ తాటి చుక్కమ్మ, తిరుపతి, ఎంపీటీసీలు మండల రాము, పూనెం సురేందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్లో చేరిన ప్రజా పరిధిలో వీరే

మున్సిపల్ చైర్మెన్ ధమ్మాలపాటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు వార రవి, అంకేపాక నవీన్, మొగిలి లక్ష్మీ, కో ఆప్షన్ సభ్యులు నాగమణి, ధనియాలపాడు సర్పంచ్, సుభాష్ నగర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు ఆళ్ళ నాగేశ్వరరావు, గుమ్మడి అపర్ణ, భూక్య కమల, వజ్జ శ్రీనులకు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ద్వంద వైఖరి వల్ల ఇమడలేకనే : డీవీ

రాష్ట్రంలో మున్సిపాలిటీని నెంబర్ వన్ స్థానంలో తీసుకువచ్చాను. బీఆర్ఎస్‌లో నెలకొన్న ద్వంద వైఖరి వల్ల ఇమడలేకనే కాంగ్రెస్ పార్టీలోకి వచ్చినట్లు మున్సిపల్ చైర్మెన్ డీవీ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. పట్టణ ప్రజలందరికీ కూడా క్షమాపణలు చెబుతున్నాను. గత నాలుగు సంవత్సరాలుగా ప్రజలు ప్రముఖులంతా కూడా అభివృద్ధిలో సహకరించారు. వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కోరం కనకయ్య గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు.

అంతుచుస్తానంటూ హరి సింగ్ బెదిరించారు : ఎంపీపీ నాగరత్నమ్మ

బీఆర్ఎస్ పార్టీలో బెదిరింపులు, అవమానాలు భరించలేక కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ఇల్లందు ఎంపీపీ చీమల నాగరత్నమ్మ పేర్కొన్నారు. హరిసింగ్ అంతు చూస్తానని బెదిరింపులకు గురి చేయటం సరికాదన్నారు. తనకు తన భర్తకు ఏమైనా హాని జరిగితే ఎమ్మెల్యే హరి ప్రియ హరి సింగ్ దే బాధ్యతని అన్నారు. ఇటీవల హర్సింగ్ నాయక్ ఫోన్లో మాట్లాడుతూ బెదిరింపులకు గురి చేశారని చెబుతూ రికార్డు వాయిస్ ని విలేకరులకు వినిపించారు.



గడపగడపకూ న్యాయ సహాయం అందిచడమే ధ్యేయం

సీనియర్ సివిల్ జడ్జ్ మహమ్మద్ అబ్దుల్ జావిద్ పాషా

నవతెలంగాణ-తల్లాడ

గడపగడపకూ న్యాయ సహాయం అందించటమే న్యాయ సేవా సంస్థల ధ్యేయమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా అన్నారు. జాతీయ న్యాయ సేవా సంస్థల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం తల్లాడ మండలంలోని నూతనకల్ గ్రామంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ సత్వర న్యాయం, న్యాయ సేవలు నిమిత్తం న్యాయ సేవా సంస్థలు పనిచేస్తాయని, లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో కేసుల పరిష్కారానికై లోక్ అదాలత్ లు నిర్వహించటం, ఉచిత న్యాయ సహాయం అందించడం, న్యాయ చైతన్య సదస్సులో నిర్వహించటం ముఖ్యంగా న్యాయ సేవా సంస్థలు పనిచేస్తున్నాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల వారికి చట్టాల పట్ల అవగాహన కల్పించినట్లయితే వారికి ఉపయుక్తంగా ఉంటుందని ఉద్దేశంతో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. బాలల విషయానికొస్తే చదువుకునే దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకున్నట్లయితే బంగారు భవిష్యత్తు సొంతమైతుందన్నారు. న్యాయ సేవా సంస్థ ప్యానెల్ న్యాయవాది ఇమ్మడి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు.

బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

కారేపల్లి మండలానికి చెందిన నిందితుడు అంగడి రామకృష్ణకు మైనర్ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.20వేల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.ఉమాదేవి గురువారం తీర్పు చెప్పారు. ఫిర్యాది కూతురు నిందితుడు ఇంట్లో ఆడుకోనుచుండగా నిందితుడు మైనర్ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడని 13-5-2021న కారేపల్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయిందవి. విచారించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువు కావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొత్త వెంకటేశ్వరరావు వాదించగా, లైజన్ ఆఫీసర్ వి.భద్రు నాయక్, కోర్టు కానిస్టేబుల్ టి.వెంకటేశ్వరరావు, హెూంగార్డు ఎం.డి ఆయూబ్‌లు సహకరించారు.



యువకుడిపై హత్యాయత్నం

బీరోలులో ఘటన

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

యువకుడిపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని బీరోలు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సురేష్‌పై ఉదయం 7 గంటలకు ఇంటి పక్కన ఉన్న వారు ఆకస్మికంగా కత్తితో వచ్చి దాడి చేశారని చెప్పారు. కత్తితో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. ఖమ్మం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించగా 15 కుట్లు పడ్డాయి. ఎడమ చేతి భుజంపై పెద్ద గాయం కావడంతో ఐదు కుట్లు పడ్డాయని అన్నారు. ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతున్నాడని చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

కామేపల్లి : జోగుగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీలో బట్టు శంకర్ నాయక్, సర్పంచు జరపల భగవాన్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. హరిప్రియ గెలుపుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బూర్జవా పార్టీలను ఓడించాలి

మొదటి పేజీ తరువాయి

యర్రా శ్రీకాంత్‌తో పాటు ఇతర నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించాల్సిందిగా పిలుపునిచ్చారు. మార్క్సిస్టు పార్టీని బలహీనం చేసి తమ అక్రమాలను అడ్డూ అదుపులేకుండా కొనసాగించాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆ లక్ష్యానికి మనం అవకాశం ఇద్దమా? ప్రజల తరపున పోరాడే వారిని గెలిపించుకుందామా? అని ప్రశ్నించారు. ప్రజలు చారిత్రక నిర్ణయాన్ని తీసుకుని సీపీఐ(ఎం) అభ్యర్థులను బలపరచాలని కోరారు. మిగతా పార్టీల అభ్యర్థులకు డబ్బుల సంచులు ఉండొచ్చు...అంతుమించి అవకాశవాదం ఉండొచ్చు...ఇవ్వాళ ఏ పార్టీలో ఉన్నారో...రేపు ఏ పార్టీలో ఉంటారో కూడా వారే చెప్పలేని పరిస్థితి ఉందన్నారు. పదవులను అనుభవించడానికి కాదు...వాటి కోసం వెంపర్లాడాల్సిన అవసరం లేదన్నారు. అత్యధిక ఓట్లు సాధించి...సీపీఐ(ఎం)కు ఉన్న బలాన్ని రుజువు చేయాలని కోరారు. నీటి వనరుల కోసం పాదయాత్ర చేసిన ఘనత సీపీఐ(ఎం) అభ్యర్థులకే ఉందన్నారు. సామాజిక న్యాయం కోసం పోరాటం చేసింది కూడా తమ పార్టీ అభ్యర్థులేనన్నారు. డబ్బులు సంపాదించుకొని, ఆ డబ్బులను ఏం చేసుకోవాలో అర్థం కాకుండా ఓట్లు కొనుగోలు చేసే వాళ్లను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ రాష్ట్రాన్ని, దేశాన్ని రక్షించుకోవాలంటే బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను గెలిపించకూడదన్నారు. వామపక్షాలను గెలిపించాలని కోరారు.

కార్పొరేట్లు...కమ్యూనిస్టులకు పోటీ: వెంకట్

డబ్బు, ప్రజా పోరాటాలు, కార్పొరేట్లు, కమ్యూనిస్టులకు మధ్య పోటీ.. ఇందులో ప్రజల పక్షాన నిలబడే సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించాలని పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ పిలుపునిచ్చారు. కార్పొరేట్లకు పాలేరు గడ్డపైన చోటు లేదన్నారు. కమ్యూనిస్టు సత్తా చాటాలనే ఖమ్మం జిల్లాలో అన్ని స్థానాల్లో పోటీ చేస్తున్నామన్నారు. శ్రీనివాసరెడ్డి, ఉపేందర్‌రెడ్డి గెలిస్తే వ్యవసాయం కార్పొరేట్ల పరం అవుతుందన్నారు. దళితుల పట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ చరిత్ర ఏంటని ప్రశ్నించారు. దళితున్ని పూజారి చేసిన ఘనత సీపీఐ(ఎం) ఏలుబడిలోని కేరళదన్నారు. ధనవంతులు, కార్మికులు, వ్యవసాయదారులు, కార్పొరేట్లు, ఉత్పత్తిదారులు, దోపిడీదారులకు మధ్య ఈ ఎన్నికల్లో పోటీ నెలకొందన్నారు. చిర్రావూరి, మంచికంటి, వైఆర్కే, బోడేపూడి వంటి ఆదర్శనేతలు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు తమ్మినేని సుబ్బయ్య వారసత్వంగా బరిలో ఉన్న తమ్మినేనిని గెలిపించి ప్రజాపోరాటాలకు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.

సింహం ఎప్పుడూ సింగిల్‌గానే: తమ్మినేని

సింహం ఎప్పుడూ సింగిల్ గానే వస్తుందని...ఈ ఎన్నికల్లో సీపీఐ(ఎం) సింహంలాగా ముందుకొస్తుందని పాలేరు నియోజకవర్గ అభ్యర్థి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ సీట్ల కేటాయింపుల్లో సీపీఐ(ఎం)తో వ్యవహరించిన తీరును వివరించారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి లాంటోడు సీపీఐ(ఎం)కు మంత్రి పదవులిస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రధాని పదవినే తృణప్రాయంగా వదిలేసిన చరిత్ర సీపీఐ(ఎం) నేత జ్యోతిబసుదని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు దద్దమ్మల్లా మాట్లాడుతున్నారన్నారు. కొన్ని మీడియాల్లో తనపై వచ్చిన వార్తలను ఖండించారు.

ఒప్పందాల కోసమో పోటీ చేయట్లేదు: పోతినేని

ఏ ఒప్పందాల కోసమో సీపీఐ(ఎం) పోటీ చేయట్లేదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. కమ్యూనిస్టులు బలంగా ఉన్న జిల్లాను వదులుకోవడానికి సిద్ధంగా లేమన్నారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితమే ఇళ్లు, స్థలాలని ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి యర్రా శ్రీకాంత్ అన్నారు. ఖమ్మం



మార్కెట్‌ను తరలించాలని పువ్వాడ, తుమ్మల ప్రయత్నిస్తే అడ్డుకున్నది తమ పార్టీ అన్నారు. పాతబస్టాండ్, మున్సిపల్ కార్యాలయాలను ఎత్తివేసి వన్‌టౌన్, మార్కెట్‌ను తరలించి త్రీటౌన్‌ను నిర్వీర్యం చేయాలని చూసిన నేతలు పువ్వాడ, తుమ్మల అన్నారు. వీరద్దరూ మారని పార్టీలు లేవన్నారు.

భారీ ర్యాలీగా నామినేషన్...

సీపీఐ(ఎం) పాలేరు అభ్యర్థి తమ్మినేని వీరభద్రం పెవిలియన్‌గ్రౌండ్ నుంచి ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. మయూరిసెంటర్, జూబ్లీక్లబ్, కాల్వడ్డు మీదుగా ఖమ్మం రూరల్ తహశీల్దార్ కార్యాలయం వరకు వేలాదిమంది జనంతో ర్యాలీగా వెళ్లి తమ్మినేని నామినేషన్ దాఖలు చేశారు. తమ్మినేనితో పాటు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.వెంకట్, పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా నాయకులు సిద్దినేని కోటయ్య కలిసి వెళ్లి రిటర్నింగ్ అధికారి ఎం.రాజేశ్వరికి నామినేషన్ పత్రాలను అందించారు. అంతకుముందు ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి యర్రా శ్రీకాంత్ బి.వెంకట్, పోతినేని, నున్నాతో పాటు పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్‌తో కలిసి నామినేషన్ సమర్పించారు. ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్‌సురభి నామినేషన్ ప్రతులు స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్, భూక్యా వీరభద్రం, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, సీనియర్ నాయకులు సోమయ్య, అఫ్రోజ్‌సమీన తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ



ప్రజల కోసం పోరాడే సీపీఐ(ఎం)కు మద్దతుగా నిలవండి

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-మధిర

పోరాటాల పురిటి గడ్డ, ఉద్యమాల నిలువైన మధిర నియోజకవర్గంలో ప్రస్తుత పాలకులు చేసిన అభివృద్ధి ఏమీ లేదని, భట్టి గెలిచినా, కమల్ రాజు గెలిచినా మధిరకు ఒరిగేదేమీ లేదని సీపీఐ(ఎం)రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. మధిరలోని బోడెపూడి భవన్లో మండల కార్యదర్శి మందా సైదులు అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధిర నియోజకవర్గంలో సిపిఎం అభ్యర్థిగా పాలడుగు భాస్కర్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేస్తారని అన్నారు. అనంతరం పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మధిర నియోజకవర్గంకు చేసిందేమీ లేదన్నారు. తనకు మద్దతుగా నిలిచి గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం మధిర సిపిఐ (యం)అభ్యర్థిగా మొదటి సెట్ నామినేషన్ దాఖలు చేశారు. సమావేశంలో నాయకులు శీలం నరసింహారావు, మండల ఫణీంద్ర కుమారి, పడకండి మురళి, చింతలచెరువు కోటేశ్వరరావు, మద్దాల ప్రభాకర్, పాలడుగు సుధాకర్, రామ నరసయ్య, విజయ్, మధు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం : మధిర నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థిగా పాలడుగు భాస్కర్‌ను గెలిపించాలని మండలంలో కరపత్రాలు పంచుతూ ప్రచారాన్ని నిర్వహించారు. నరసింహపురం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ శుక్రవారం సిపిఎం అభ్యర్థిగా పాలడుగు భాస్కర్ మధిరలో నామినేషన్ వేస్తు న్నారని, నామినేషన్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గామాసు జోగయ్య, చిత్తారు కిషోర్ బాబు, కోలా రవికుమార్, రాములు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు సంభాని రాజీనామా

- బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన ఎంపీలు నామ, వద్దిరాజు

నవతెలంగాణ-కల్లూరు



గత 50 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేస్తూ జీవితాన్ని దారపోసినా చివరలో కాంగ్రెస్ పార్టీ తనకు తీరని అన్యాయం చేసిందని, ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి తప్పనిపరిస్థితిలో రాజీనామా చేస్తున్నట్లు మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ తెలిపారు. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఆదేశం మేరకు గురువారం కల్లూరు మండలంలోని రామకృష్ణాపురం క్యాంప్ కార్యాలయం వద్ద ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, కల్లూరు మండల కమిటీ అధ్యక్షులు పాలెపురామారావు, రైతు సమితి మండల కన్వీనర్ లక్కినేని రఘులు సంభాని చంద్రశేఖర్‌ని కలిసి పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. అందుకు సంభాని సుముఖత వ్యక్తం చేయడంతో నామ నాగేశ్వరరావు శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా సంభాని చంద్రశేఖర్ మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో ఇలాంటి రాజకీయాలు తానెప్పుడూ చూడలేదని, సీనియర్ నాయకుడైన తనకు టికెట్ ఇవ్వకపోగా టికెట్ ఇచ్చే ముందు కనీసం సంప్రదింపులు కూడా చేయకపోవడం దురదృష్టకరమన్నారు. జరిగిన అవమానాన్ని భరించలేకనే బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకట వీరయ్య గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి సమక్షంలో పార్టీలో చేరేందుకు హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో జడ్పిటిసి కట్ట అజయ్‌కుమార్, పి.శ్రీనివాసరావు, మనోహర్‌రెడ్డి, పెద్దపోయిన దుర్గా ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఎర్ర జెండా సత్తా చూపాలి

నవతెలంగాణ-వైరాటౌన్



వైరా నియోజకవర్గంలో ఎర్ర జెండా సత్తా చూపాలని, నవంబర్ 10న జరిగే సిపిఐ(ఎం) అభ్యర్థి కామ్రేడ్ భూక్యా వీరభద్రం నామినేషన్ కార్యక్రమంలో వేలాది మంది ప్రజలు, కమ్యూనిస్టు అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు పిలుపు నిచ్చారు. గురువారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు గ్రామంలో గుమ్మా నరసింహారావు అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో బొంతు రాంబాబు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు, రాజకీయ చైతన్యంకు కేంద్ర బిందువుగా ఉన్న వైరా నియోజకవర్గంలో ఎర్రజెండా సత్తా చూపాలని అన్నారు. అనంతరం సిపిఐ(ఎం) వైరా మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, వైరా పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మచ్చా మణి, మల్లెంపాటి రామారావు, ఇమ్మడి సుధీర్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) నాయకులు పల్లెబోయిన కష్ణ, కామినేని రవి, చిత్తారు మురళి, బోడ్డు నారాయణ, కిన్నెర నారాయణ, దేవభక్తిని నరిసింహారావు, పుచ్చకాయల రామయ్య పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) విస్తృత ప్రచారం

సిపిఐ(ఎం) వైరా నియోజకవర్గ అభ్యర్థి భూక్యా వీరభద్రం నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ వైరా మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య నగర్, లీలా సుందరయ్య నగర్, రాజశేఖర్ నగర్ నందు విస్తతంగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ(ఎం) వైరా పట్టణ కమిటీ సభ్యులు గుడిమెట్ల మోహన్ రావు, సీనియర్ నాయకులు కురుగుంట్ల శ్రీనివాసరావు, మహిళా శాఖా కార్యదర్శి తోట కృష్ణవేణి, భూక్యా విజయ, దేవబత్తిని లక్ష్మీతులసి తదితరులు పాల్గొన్నారు.

'సీతారామ'తో సత్తుపల్లి ప్రాంత ప్రజల కాళ్లు కడుగుతా

- సత్తుపల్లిని జిల్లాను చేసే బాధ్యతను తీసుకుంటా
- సత్తుపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య
- కాంగ్రెస్ పార్టీ కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లింది
- ఎంపీలు నామ, బండి, వద్దిరాజు



నవతెలంగాణ-సత్తుపల్లి

సీతారామ ప్రాజెక్టు జలాలను సత్తుపల్లి ప్రాంతానికి తీసుకొచ్చి ప్రజల కాళ్లు కడుగుతానని సత్తుపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య అన్నారు. గురువారం నామినేషన్ కార్యక్రమానికి ముందు ఎంపీ నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి, వద్దిరాజు రవిచంద్రతో కలిసి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సండ్ర మాట్లాడారు. కేసీఆర్ సహకారంతో సత్తుపల్లిని జిల్లాగా చేసే బాధ్యతను తీసుకుంటానన్నారు. ఎంపీ నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిందని, ఇందుకు నిదర్శనమే 40 యేండ్ల కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తూ మచ్చలేని నాయకుడిగా పేరు తెచ్చుకున్న సంభాని చంద్రశేఖర్‌కి జరిగిన అన్యాయమే ఇందుకు నిదర్శమన్నారు. రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి, వద్దిరాజు రవిచంద్రలు మాట్లాడుతూ కాలుకు బలపం కట్టుకొని ప్రజల్లో తిరుగుతూ కష్టపడే మనస్తత్వం ఉన్న సండ్ర వెంకటవీరయ్యను గెలిపించాలని, నియోజకవర్గ ప్రజలకు మేమంతా అండగా ఉంటామని అన్నారు. ఈనెల రోజుల పాటు నియోజకవర్గ ప్రజల మధ్యనే ఉంటూ సండ్ర గెలుపుకు కృషి చేస్తామని వారన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, ఆత్మ ఛైర్మెన్ వనమా శ్రీనివాసుదేవరావు, ఎంపీపీలు దొడ్డా హైమవతిశంకరరావు, లక్కినేని అలేఖ్యవినీల్, పగుట్ల వెంకటేశ్వరరావు, దొడ్డా శ్రీనివాసరావు, బీరవల్లి రఘు, నాయకులు ఎస్కే రఫీ, అంకమరాజు, కౌన్సిలర్లు, ఐదు మండలాల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు హాజర య్యారు.

గులాబీ జనసంద్రంతో నామినేషన్‌కు బైలెల్లిన 'సండ్ర'

సత్తుపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య నామినేషన్ పత్రాలను దాఖలు చేసే ప్రక్రియ గురువారం గులాబీ జనసంద్రం కోలాహలం మధ్య అట్టహాసంగా జరిగింది. నామినేషన్ దాఖలకు ముందు ఉదయాన్నే పెనుబల్లి మండలంలోని నీలాద్రీశ్వర ఆలయంలో నామినేషన్ పత్రాలతో పూజలు చేయించు కున్నారు. సత్తుపల్లిలోని హనుమాన్ నగర్ అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు జరిపారు. బైబిల్ మిషన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థన చేయించుకున్నారు. నామినేషన్ సందర్భంగా జరిగిన సభ అనంతరం ఎంపీలు నామ, బండి, వద్దిరాజులతో కలిసి హనుమాన్‌నగర్ నుంచి గులాబీ శ్రేణుల భారీ ప్రదర్శన నడుమ సండ్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి అశోకచక్రవర్తికి అందజేశారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి... అభివృద్ధేంటో చూపిస్తాం

- అభ్యర్థి డాక్టర్ మట్టా రాగమయి దయానంద్
- భారీ శ్రేణులతో నామినేషన్‌కు తరలిన డాక్టర్ దంపతులు



నవతెలంగాణ-సత్తుపల్లి

ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను గెలిపిస్తే అభివృద్ధేంటో చేసి చూపిస్తామని సత్తుపల్లి కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. గురువారం నామినేషన్ పత్రాలను దాఖలు చేసిన అనంతరం డాక్టర్ దంపతుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులతో పట్టణంలో భారీ ప్రదర్శన జరిగింది. స్థానిక బస్టాండ్ చౌరస్తాలో జరిగిన సభలో డాక్టర్ రాగమయి, డాక్టర్ దయానంద్ మాట్లాడారు. ఆతినుంచి కాంగ్రెస్ కుటుంబంగా ఉన్న తమను నమ్మి సత్తుపల్లి నుంచి కాంగ్రెస్ తరపున పోటీచేసే అవకాశం ఇచ్చిన ఏఐసీసీ, టీపీసీసీ అగ్రనాయకులకు ధన్యవాదాలు తెలిపారు. టిక్కెట్ ఇప్పించే విషయం సంపూర్ణ సహకారం అందించిన మాజీ కేంద్రమంత్రి రేణుకాచౌదరి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామన్నారు. తమకు మద్దతు తెలుపుతున్న టీడీపీ, సీపీఐ పార్టీలను కలుపుకొని ఎన్నికల సమరంలోకి వెళ్తామన్నారు. స్థానిక బిడ్డగా సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇప్పుడున్న కాంగ్రెస్ శ్రేణుల జోష్‌ను చూస్తుంటే 30వేలకు పైగా మెజార్టీతో తెలుస్తామని డాక్టర్ దంపతులు తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ నామినేషన్ దాఖలు

సత్తుపల్లి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఐదు మండలాల నుంచి భారీగా తరలి వచ్చిన కాంగ్రెస్ శ్రేణులతో భారీ ప్రదర్శనగా డాక్టర్ రాగమయి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. పూరించిన నామినేషన్ పత్రాలను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అశోకచక్రవర్తికి అందించారు.

వైరాలో మదన్‌లాల్‌దే గెలుపు

ఎంపీ నామ నాగేశ్వరరావు

నవతెలంగాణ-వైరా



వైరా నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి బాణోతు మదన్ లాల్ నామినేషన్ దాఖలు రోజే విజయం ఖాయమమైందని ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు అన్నారు. గురువారం బీఆర్ఎస్ అభ్యర్థిగా మదన్ లాల్ నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌తో కలిసి స్థానిక మధిర క్రాస్ రోడ్డు వద్ద జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో నామ నాగేశ్వరరావు మాట్లాడారు. కేసీఆర్ ఉద్యమాల ఫలితంగానే తెలంగాణ ఏర్పడిందని, కరెంట్ కష్టాలు లేని రాష్ట్రమని, అభివృద్ధికి కేరాఫ్ కేసీఆర్ అన్నారు. మదన్ లాల్ గెలుపు ఖాయమైందని, మెజార్టి ఎంతన్నదే ఈనెల 30న జరిగే ఎన్నికలు, వచ్చేనెల మూడున జరిగే ఓట్ల లెక్కింపుతో తెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మదన్ లాల్ మాట్లాడుతూ తాను నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అంతకముందు వైరాలోని బీఆర్ఎస్ ఎన్నికల క్యాంపు కార్యాలయం నుంచి ర్యాలీగా నామా, మదన్‌లాల్, రాములునాయక్ నామినేషన్ దాఖలుకు తహసీల్దార్ కార్యాలయానికి తరలివెళ్లారు. వైరా మునిసిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు..

నేను బెదిరింపులకు పాల్పడినట్లు నిరూపిస్తే రాజకీయం వదులుకుంటా..

కాంగ్రెస్ ఖమ్మం నియోజవర్గ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

స్వాతంత్ర పోరాటంలో జాతిపిత మహాత్మాగాంధీ నడయాడిన ప్రాంతం ఇదని కాంగ్రెస్ పార్టీ ఖమ్మం నియోజవర్గ అభ్యర్థి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తు చేశారు.ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో త్రీ టౌన్ ప్రాంతంలోని స్థానిక 36వ డివిజన్ గాంధీచౌక్‌లో తుమ్మల ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. నలభై ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఇంత అరాచక, అవినీతి పాలన ఎప్పుడూ చూడలేదన్నారు. అక్రమంగా మట్టి డబ్బులు, ఇసుక డబ్బులు, ఆఖరికి బ్రాందీ షాప్‌ల దగ్గర వసూళ్లు చేసిన సంస్కృతి ఈ దరిద్రపు నాయకులకు ఉందని తుమ్మల ఆరోపించారు. నా పాలనలో ఎవరినైనా బెదిరించినట్టు నిరూపిస్తే మహాత్మాగాంధీ సాక్షిగా రాజకీయం వదులుకుంటా అని చాలెంజ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు మహమ్మద్ జావిద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మానకొండ కిషోర్, యర్రం బాలగంగాధర్ తిలక్ తదితరులు పాల్గొన్నారు.





పార్టీలు మార్చే వారిని, మతోన్మాదులను ఓడించండి

- ప్రజల కోసం పనిచేసే కమ్యూనిస్టులను గెలిపించండి
- సీపీఐ(ఎం) జాతీయ నాయకులు సాయిబాబు

నవతెలంగాణ-అశ్వారావుపేట

గెలవడానికి ఒక పార్టీలోను, అధికారం చెలాయించేందుకు మరో పార్టీ మార్చే నాయకులను, మతం పేరుతో, ప్రాంతీయతత్వం రెచ్చగొడుతున్న పార్టీల అభ్యర్థులను చిత్తు చిత్తుగా ఓడించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేసే కమ్యూనిస్టులను గెలిపించాలని సీపీఐ(ఎం) జాతీయ నాయకులు ఎం.సాయి బాబు ప్రజలకు పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) బలపరుస్తున్న అశ్వారావు పేట అభ్యర్థి అర్జున్ రావు పిట్టల నామినేషన్ సందర్భంగా, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, ఎన్నికల కన్వీనర్ కొక్కెరపాటి పుల్లయ్య అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన నామినేషన్ సభని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఇచ్చినా, కాంగ్రెస్ కు మరో అవకాశం ఇచ్చినా, మతోన్మాద భాజపాను గెలిపించిన ప్రజలకు ఒరిగేదేమీ లేదని ఆయన అభిప్రాయపడ్డారు. నీళ్ళు - నిధులు - నియామకాలు పేరుతో అధికారం చేపట్టిన కేసీఆర్ ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వలేదని అన్నారు. గతంలో 60 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ కు మరో అవకాశం ఇచ్చినా ఒరిగేదేమీ లేదని తెలిపారు. మతం పేరుతో సమాజంలో వైషమ్యాలు సృష్టించే ఆర్ఎస్ఎస్ భావజాల భాజపాతో సమాజంలో చీలిపోయి అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేసారు. అందుకోసమే కమ్యూనిస్టులను చుట్టూ సభలకు పంపితే ప్రజాప్రయోజన చట్టాలు రూపొందిస్తారని అన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికులు కోసం, ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికుల, భవన నిర్మాణ కార్మికుల, హమాలి కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం పనిచేస్తున్న సీఐటియు నాయకులు అర్జున్ రావును అసెంబ్లీకి పంపితే మీ అందరి తరుపున చట్టబద్ధంగా పోరాడటానికి వీలుంటుందని పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరం కనకయ్య అన్నారు.

ఈ కార్యక్రమంలో అభ్యర్థి పిట్టల అర్జున్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యం.జ్యోతి,లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, కొండపల్లి శ్రీధర్, బి.చిరంజీవి నాయుడు, దొడ్డ లక్ష్మీనారాయణ, ముదిగొండ రాంబాబు, సీనియర్ నాయకులు యం.వి అప్పారావు, దమ్మపేట మండల కార్యదర్శి మోరంపుడి శ్రీనివాసరావు, చంద్రుగొండ మండల కార్యదర్శి ఏ.రామిరెడ్డి, అన్నపురెడ్డి పల్లి మండల కార్యదర్శి జంగిలి వెంకటరత్నం, నాయకులు బుర్ర వీరభద్రం, నాగ కృష్ణ,రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.



అధిక సంఖ్యలో నామినేషన్లు

నవతెలంగాణ-మణుగూరు

పినపాక నియోజకవర్గంలో అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలైనాయని నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ తెలిపారు. గురువారం రేగా కాంతారావు (బీఆర్ఎస్), బట్టా విజయ్ గాంధీ (స్వతంత్ర అభ్యర్థి), వజ్జా జ్యోతి బసు (గోండ్వన దండకారణ్య పార్టీ - రిజిస్టర్డ్ పార్టీ), పూనెం రాజేష్ (స్వతంత్ర అభ్యర్థి), వజ్జా శాములు (బిఎస్‌పీ), పోడియం బాలరాజు (బీజేపీ) తదితరులు నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం విప్ రేగా కాంతారావు ఇతర నామినేషన్‌లో వేసిన అభ్యర్థులు తమ విజయం పై ధీమా వ్యక్తం చేశారు.

ఎర్రజెండాను ఆదరించండి

కారం పుల్లయ్యను అసెంబ్లీకి పంపించండి

- పట్టణ ప్రముఖులను కలిసిన సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం తెలంగాణ అసెంబ్లీలో భద్రాచల సమస్యలపై గళం విప్పి ఏజెన్సీ సమస్యల పరిష్కారానికి కారం పుల్లయ్యను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలని మాజీ పార్లమెంట్ సభ్యులు మీడియం బాబురావు కోరారు. గురువారం భద్రాచలం పట్టణంలో సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి కారం పుల్లయ్య, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, ఎలమంచిలి రవికుమార్ నేతృత్వంలో ఆ పార్టీ బృందం భద్రాచలం పట్టణంలోని ప్రముఖులను, వైద్యులను, వ్యాపారస్తులను కలిశారు. గతంలో భద్రాచలం ఏజెన్సీ మొత్తం సమగ్ర వృద్ధి చేసింది సీపీఐ(ఎం) ప్రజాప్రతినిధులైనని ఏ స్వార్థం లేకుండా నిస్వార్థంగా ప్రజాసేవ చేసేందుకే పార్టీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని, ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. రోజుకొక పార్టీలు మారుతున్న వారిపట్ల భద్రాచలం ప్రజల అప్రమత్తంగా ఉండాలని కోరారు. సీతారాముల కల్యాణానికి తలంబ్రాలు కూడా తీసుకురాని ప్రభుత్వ పెద్దలు భద్రాచలం అభివృద్ధికి నిధులు కేటాయిస్తారంటే ఎలా నమ్మాలి అని ప్రశ్నించారు. గత పది సంవత్సరాల నుండి భద్రాచలం నియోజకవర్గం ఎంపీలుగా పనిచేస్తున్నది బీఆర్ఎస్ పార్టీ ఎంపీలేనని, నియోజవర్గానికి ఎందుకు నిధులు కేటాయించలేదని ప్రశ్నించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేని కాబట్టే నిధులు ఇవ్వటం లేదంటున్న పొదెం వీరయ్య గతంలో సీపీఐ(ఎం) ఎమ్మెల్యేలు ప్రతిపక్షంలోనే ఉండి అభివృద్ధి నిధులు సాధించారన్న విషయం పోదె వీరయ్య తెలుసుకోవాలని హితువు పలికారు. ఈ ఐదు సంవత్సరాల కాలంలో అభివృద్ధి నిధుల కోసం ఎమ్మెల్యేగా మీరు ఏం పోరాటాలు చేశారో ప్రజలకు వివరించాలని కోరారు. ప్రజల తరపున ప్రశ్నించే గొంతుక కారం పుల్లయ్య అసెంబ్లీకి పంపడం ద్వారా భద్రాచల సమస్యలపై పోరాడుతారని హామీ ఇచ్చారు. సున్నం రాజయ్య, కుంజ బుజ్జి వంటి మహనీయుల పోరాట వారసుడిగా నిస్వార్థ రాజకీయ నాయకుడైన పుల్లయ్యను అసెంబ్లీకి పంపడం ద్వారా భద్రాచల సమగ్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా వారు కోరారు. అవకాశవాద రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పి తిరిగి భద్రాచలం గడ్డపై ఎర్రజెండాను ఎగురవేయాలని వారు కోరారు. ప్రముఖులను కలిసిన వారిలో సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలగాని బ్రహ్మాచారి, భీమవరపు వెంకటరెడ్డి, ఎర్రంశెట్టి వెంకట రామారావు తదితరులు ఉన్నారు.

సీపీఐ(ఎం) అభ్యర్థి దుగ్గి కృష్ణ నామినేషన్

కష్టజీవుల పార్టీని గెలిపించండి : అండగా ఉంటాం

నవతెలంగాణ-ఇల్లందు



ఇల్లందు అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థిగా భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) నుండి దుగ్గి కృష్ణ గురువారం రిటర్నింగ్ అధికారి కాశయ్యకు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో దుగ్గి యఔష్ణ, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ ,ఖమ్మం జిల్లాల కమిటీ సభ్యులు అబ్దుల్ నబి, రేపాకుల శ్రీనివాస్, కందునూరి శ్రీనివాస్, కందునూరి కవిత, శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. కష్టజీవుల పార్టీని గెలిపిస్తే అండగా ఉంటామన్నారు. తెలంగాణ ఎన్నికలలో సీపీఐ(ఎం) కార్మిక, కర్షక ఎజెండాతో ఎన్నికలోకి వస్తున్నదని సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఇల్లందు, టేకులపల్లి, కామేపల్లి గార్ల, బయ్యారం మండలాల నేతలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బాదావత్ శ్రీనివాస్, ఈశ్వర లింగం, ఆలేటి కిరణ్, మన్యం మోహన్ రావు, వజ్జ సురేష్, కూకట్ల శంకర్, లక్ష్మీ, వెంకటరెడ్డి, వీరన్న, ఈసం నరసింహారావు, రాము, రాందాస్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) అభ్యర్థి అర్జున్‌రావు నామినేషన్ దాఖలు

నవతెలంగాణ-అశ్వారావుపేట



తెలంగాణ రాష్ట్ర సాధారణ అసెంబ్లీ 2023లో జరుగుతున్న ఎన్నికలకు అశ్వారావుపేట నియోజక వర్గం సీపీఐ(ఎం) అభ్యర్థిగా పిట్టల అర్జున్ రావు గురువారం నామినేషన్ దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.రాంబాబు తెలిపారు. అర్జున్ రావు అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య బి.ఫాం అందజేసారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య అర్జున్ రావు అభ్యర్థిగా ప్రపోజ్ చేసారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అప్పారావు, మండల కమిటీ సభ్యులు మడిపల్లి వెంకటేశ్వరరావు ఉన్నారు. అనంతరం డమ్మి అభ్యర్థిగా గొగ్గెల ఆదినారాయణ నామినేషన్ వేయగా ఆయన వెంట జిల్లా కమిటీ సభ్యులు అన్నవరం సత్యనారాయణ, శివరాం ప్రసాద్, జ్యోతి, ముదిగొండ రాంబాబులు పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు చేసిన హరిప్రియ నాయక్

నవతెలంగాణ -ఇల్లందు





అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గురువారం పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. జెకె కాల్ నుండి ప్రారంభమైన ప్రదర్శన గోవింద్ సెంటర్ వరకు కొనసాగింది. ఇల్లందు టేకులపల్లి గార్ల బయ్యారం కామేపెల్లి మండలాల నుండి ప్రజలు భారీగా తరలివచ్చి ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఇల్లందు నియోజకవర్గ అభ్యర్థిగా హరిప్రియ బీఫామును ఎన్నికల అధికారి కాశయ్యకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ ఇన్చార్జి, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మహబూబాబాద్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కుమారి ఆంగోత్ బిందు, జిల్లా గ్రంథాలయ సంస్థ దిండిగల రాజేందర్, మున్సిపల్ వైస్ చైర్మెన్ సయ్యద్ జానీ పాష, నాయకులు రంగనాథ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి పొదెం నామినేషన్

- ఉత్సాహంగా పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు
- భద్రాద్రి రామయ్యకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం ఎమ్మెల్యే, అసెంబ్లీ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొదెం వీరయ్య గురువారం నామినేషన్ వేశారు. భద్రాచలం ఆర్డీవో కార్యాలయంలో ఈ మేరకు నామినేషన్ పత్రాలను మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, హైకోర్టు న్యాయవాది జయరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బడగం శ్రీనివాస్, టీడీపీ నాయకులు కుంచాల రాజారామ్‌తో కలిసి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు అందజేశారు. ఈ నామినేషన్ పర్వంలో కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా



పాల్గొన్నాయి. అంతకుముందు భద్రాచలం ఎమ్మెల్యే వీరయ్య భద్రాద్రి రాముని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గం ప్రజలు మరోమారు తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తారని, నీతిని, నిజాయితీని, ఈ ప్రాంత ప్రజలు పరిగణలోకి తీసుకుంటారని అన్నారు. ఇదిలా ఉండగా టీడీపీ నాయకులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నట్లు వెల్లడించారు.

భద్రాద్రికి సీఎం మోసం చేశారు

భద్రాచలం పుణ్యక్షేత్ర ప్రగతికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏమాత్రం పూనుకోలేదని, సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి భద్రాద్రి ప్రజలను మోసం చేశారని మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు. భద్రాచలంలో గురువారం ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ మొహం పెట్టుకొని స్థానిక ప్రజలను బీఆర్ఎస్ నేతలు ఓట్లు అడుగుతున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ పాత్రికేయ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బుడగం శ్రీనివాస్, సరేల నరేష్, రౌతు నరసింహారావు, పరుచూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిగా తెల్లం నామినేషన్

నవతెలంగాణ-భద్రాచలం



బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న డా.తెల్లం వెంకట్రావు గురువారం నామినేషన్ వేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా శాసనమండలి సభ్యులు తాతా మధుసూదన్‌తో కలిసి నామినేషన్‌ను వేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు బుచ్చయ్య, తాండ్ర వెంకటరమణ, ఆడిటర్ గంట కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ... తప్పకుండా ఈసారి బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం గెలవడం ఖాయం అన్నారు. ప్రజలందరూ తెల్లంను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు.

కమ్యూనిస్టులు లేని అసెంబ్లీ స్మశాన వాటికతో సమానం

- పేదలు ఉన్నంతకాలం ఎర్రజెండా ఎగురుతూనే ఉంటుంది
- సీపీఐ(ఎం) మండల కన్వీనర్ నిమ్మల వెంకన్న

నవతెలంగాణ-పినపాక



కమ్యూనిస్టులు లేని అసెంబ్లీ స్మశాన వాటికతో సమానమని, పేద ప్రజల గుండెల్లో ఎర్రజెండా స్థానం సుస్థిరమైనదని, పేద ప్రజల కోసం ఎర్రజెండా పోరాటం చేస్తూనే ఉంటుందని సీపీఐ(ఎం) మండల కన్వీనర్ నిమ్మల వెంకన్న అన్నారు. ఆయన పినపాక మండల కేంద్రంలో గురువారం మాట్లాడుతూ పార్టీ పేద ప్రజల పక్షాన గొంతు వినిపిస్తూనే ఉంటుందని తెలియజేశారు. సీపీఐ(ఎం) పార్టీ పోటీల్లో ఉన్న స్థానంలో కచ్చితంగా తామెంటో నిరూపిస్తామన్నారు. ధన అహంకార పార్టీలు పేద ప్రజల గొంతులు నొక్కడానికి ధనం ఆశ చూపి ఓట్లు దండుకుంటున్నారన్నారు. ఆపద వస్తే మాత్రం గుర్తుకు వచ్చేది ముందుగా సీపీఐ(ఎం) పార్టీనే అన్నారు. భూ పోరాటాల విషయంలో పార్టీ పాత్ర మరువలేమన్నారు. సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించి శాసనసభకు పంపించడం అవసరం అన్నారు. ఈ ఎన్నికల సందర్భంగా పార్టీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేందుకు అవకాశం కల్పించాలన్నారు.

అభివృద్ధి సంక్షేమం ప్రజలకు చేరువచేసాం



- హరిప్రియ 50 వేల మెజార్టీతో గెలవడం ఖాయం
- విలేకరుల సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఇల్లందు

రాష్ట్రంలో, నియోజకవర్గంలో గత తొమ్మిది సంవత్సరాలుగా చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యాయని ఎమ్మెల్యే హరిప్రియ 50 వేల మెజార్టీతో గెలవడం ఖాయమని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు.

హరిప్రియ నామినేషన్ దాఖలు చేసిన అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నామినేషన్ సందర్భంగా భారీ ప్రదర్శనకు ప్రజలు స్వచ్ఛందగా తరలి రావటం సంతోషకరమన్నారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజల సహకారంతో రెండవసారి ఎమ్మెల్యేగా గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



రక్షణతో కూడిన ఉత్పత్తి చేయాలి

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి 54వ పక్షోత్సవాలను పురస్కరించుకొని ఏరియా వర్క్ షాప్‌ను రక్షణ తనిఖీ బందం కన్వీనర్ ఎన్.దామోదర్ రావు, జీఎం (ఈఅండ్ఎం) సెంట్రల్ వర్క్ షాప్ సీడబ్ల్యూఎస్, నేతృత్వంలో మణుగూరు ఏరియా వర్క్ షాపును సందర్శించారు. ఏరియా వర్క్ షాపు ప్రధాన ద్వారం నుండి వర్క్ షాప్‌లో ఏర్పాటుచేసిన స్టేజి వరకు ఏరియా వర్క్ షాప్ ఉద్యోగులు అతిధులను ఆహ్వానితులను పుష్పాభిషేకంతో స్వాగతం పలికారు. ముందుగా వర్క్ షాప్ ముఖద్వారం వద్ద శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు కూడా నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఏరియా జీఎం దుర్గం రాంచందర్ రక్షణ తనిఖీ బృందం కన్వీనర్ ఎన్ దామోదర్ రావు ప్రసంగించారు. ఉద్యోగులందరూ సమిష్టి కృషితో రక్షణతో కూడిన ఉత్పత్తికి పాడుపడాలని వారు పిలుపునిచ్చారు. ఏరియా సింగరేణి కార్మిక కళాకారుడు యస్‌డి నాసర్ పాషా బృందం రచన దర్శకత్వంలో ప్రదర్శించిన రక్షణ సందేశాత్మక నాటిక "మీ క్షేమమే మా సంక్షేమం" రక్షణ తనిఖీ బృందాన్ని అధికారులను ఉద్యోగులను కూడా ఎంతగానో ఆలోచింపజేసింది. బహుమతులు కూడా అందజేశారు. రక్షణ తనిఖీ బృందం కన్వీనర్‌తో పాటు సభ్యులు ఎం.కేశవరావు ఎస్ఈ (ఈయం) సోలార్ ఎనర్జీ ఏ.నటరాజ ప్రసాద్, ఎస్.ఈ (ఈయం) సోలార్ ఎనర్జీ, ఎస్ కృష్ణారావు, ఎం.రమేష్, వర్క్ ఇనస్పెక్టర్లు రక్షణ అవగాహనను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జే.వి.రమణ, డీజీఎం యస్.మధుసూదన్, పీకే ఓసి ప్రాజెక్ట్ మేనేజర్ దండమూడి రాంబాబు, పీకే ఓసి రక్షణాధికారి యం.లింగ బాబు, ఇంజనీర్లు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

కోరం, డీవీ అమ్ముడు పోయారు

- తక్షణమే పదవులకు రాజీనామాలు చేయాలి
- విలేఖరుల సమావేశంలో దిండిగాల

నవతెలంగాణ-ఇల్లందు



రాజకీయాలు తెలియని మున్సిపల్ చైర్మెన్ దిండిగాల వెంకటేశ్వర్లని బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకొని మూడు నెలల్లోనే మున్సిపల్ చైర్మెన్‌గా సముచిత స్థానం కల్పించామని అయినప్పటికీ ఎన్నికల సమయంలో పార్టీకి నష్టం జరిగే విధంగా అమ్ముడు పోవడం దారుణమని గ్రంధాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, పట్టణ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జానీ పాషా, పలువురు కౌన్సిలర్లు విమర్శించారు. స్థానిక పాత బస్టాండ్‌లోని ఎన్నికల కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బేరసారాలు ఆడి పార్టీని అమ్మించాలని చూశాడని అన్నారు. గత ఎన్నికల్లో కోరం కనకయ్యకు బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇస్తే ఓడిపోయారని అయినప్పటికీ సీఎం కేసీఆర్ జడ్పీ చైర్మెన్ చేసి సముచిత స్థానం కల్పించారని, ఎమ్మెల్యే హరి ప్రియ హరి సింగ్ సహకరించి పార్టీలోకి ఆహ్వానించినప్పటికీ పార్టీని మోసం చేసి కాంగ్రెస్ పార్టీకి అమ్ముడుపోయారని అన్నారు. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు టికెట్ ఇచ్చినప్పటికీ చేతగానితనంతోనే ఓడిపోయారని అన్నారు. పైగా పెద్దలే ఓడించారని విమర్శలు చేయడం తనదన్నారు.

మూడో సెట్ నామినేషన్ దాఖలు చేసిన మెచ్చా

- రెండు దఫాలు టీడీపీ, నేడు బీఆర్ఎస్ తరపున నామినేషన్

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తన మూడో సెట్ నామినేషన్ పత్రాన్ని గురువారం అందజేసినట్లు ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.రాంబాబు తెలిపారు. ఇప్పటికే రెండు నామినేషన్ సెట్‌లను తన మద్దతు దారులు దాఖలు చేసారు. ఆయన వెంట ఎంపీపీ జల్లిపల్లి శ్రీరాం మూర్తి, దమ్మపేట జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, నియోజక వర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఉప్పల వెంకట రమణ ఉన్నారు. అయితే 2014, 2018 ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ బీ ఫాం పై నామినేషన్ వేసిన మెచ్చా నాగేశ్వరరావు నేడు బీఆర్ఎస్ బీ ఫాం ఆ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడం విశేషం. 2014లో వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి తాటి వెంకటేశ్వర్లు పై అపజయం పాలైన మెచ్చా 2018లో కాంగ్రెస్ బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గత ఎన్నికల్లో తనను ఓడించిన బీఆర్ఎస్ అభ్యర్థి తాటి వెంకటేశ్వర్లు పై విజయం సాధించారు. 2018లో ఆయన ఓడించిన కారు గుర్తు పైనే నేడు తాను పోటీలో ఉండటం మరో విశేషం.

పొంగులేటిని ఓడించలేకనే ఐటీ దాడులు

- దాడులను తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ శ్రేణులు

నవతెలంగాణ-బూర్గంపాడు



ప్రజా క్షేత్రంలో పొంగులేటిని ఓడించలేకనే ఐటీ దాడులను బీఆర్ఎస్, బీజేపీలు చేయిస్తున్నారని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు మారం వెంకటేశ్వర రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డిలు ఆరోపించారు. మండల పరిధిలోని సారపాక గ్రామంలో గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం వారు మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో అక్రమంగా సంపా దించిన ఎందరో నాయకులను వదిలి మానవత్వానికి, నిజాయితీకి మారుపేరు లాగా ఉండే ప్రజల మనిషి పొంగిలేటి పై దాడులు చేయడం హేమమైన చర్యని వారు పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి మోహన్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, రత్నారెడ్డి, బాదం రమేష్ రెడ్డి, రామ నరసయ్య, లక్ష్మణ్ నాయక్, జాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం : రాజకీయంగా ఎదుర్కోలేక మొన్న తుమ్మల, నిన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇండ్లపై ఐటీ, ఈడీ దాడులు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓరుగంటి భిక్షమయ్య, గాదె కేశవరెడ్డి, ముత్తినేనివాసు తీవ్రంగా ఖండించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని, సుజాత, జిల్లా, మండల కోఫ్షన్ సభ్యులు ఎం.డి షర్ఫుద్దీన్, ఎస్కే ఖదీర్ ఏనిక రవి, ఓరుగంటి రమేష్ బాబు, బొబ్బాల నగేష్, పొడియం అనిల్ కుమార్, మోర్శనేని చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నిరసన

కొత్తగూడెం : పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం అసెంబ్లీ సభ్యులు తుమ్మల నాగేశ్వరరావు ఇండ్లపై ఐటి దాడులను నిరసిస్తూ గురువారం సిపిఐ జిల్లా కార్యాలయం ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్‌పాషా మాట్లాడారు. ఎన్ని కుయుక్తులు పన్నినా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది అసెంబ్లీ స్థానాలు గెలుసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బందెల నర్సయ్య, వాసిరెడ్డి మురళి, భూక్య దస్రు, బాగం మహేశ్వర రావు, పల్నాటి ప్రశాంత్, నూనావత్ గోవిందు, కాంగ్రెస్ నాయకులు బాలప్రసాద్ పాసి, శివ, కోరి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నిలక అధికారి పోలింగ్ బూత్ సందర్శన

నవతెలంగాణ-లక్ష్మీదేవిపల్లి



మండలంలోని లాలు తండా, శ్రీనగర్, అనిశెట్టిపల్లి, ప్రశాంత్ నగర్, పోలింగ్ బూత్ సెంటర్లను ఎన్నికల అధికారి విద్యాలతతో పాటు ఎంపీఓ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అంకుబాబు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | నవంబర్ 10 2023 www.navatelangana.com

బాధ్యతాయుత ఓటర్లుగా తయారవ్వాలి

- జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక అలా
- పాల్వంచలో స్వీప్ కార్యక్రమం

నవతెలంగాణ-పాల్వంచ

విద్యార్థులు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగి ఉండడం వల్ల బాధ్యత ఓటలుగా తయారవుతారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక అలా అన్నారు. గురువారం పాల్వంచలోని బొల్లోరు గూడెం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటుచేసిన స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ పార్టిసిపేషన్) కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తూ విద్యార్థులు భవిష్యత్తు ఓటరుని ఓటు హక్కు పై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. ఓటు వినియోగించుకోవడం వల్ల జరిగే లాభాలను తెలియజేశారు. పాఠశాలలో 670 మంది విద్యార్థులు ఉన్నారని వీరందరికీ ఎన్నికల ప్రక్రియపై అవగాహనకు ఓటర్ లిటరసీ క్లబ్ ఏర్పాటు ద్వారా గత నెల రోజుల నుండి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పోలేనిర్వాహనకు మెటీరియల్ పంపిణీ పాటు



పోలింగ్ ఏ విధంగా జరుగుతుందనే ప్రక్రియ పై విద్యార్థులు మాక్ పోలింగ్ స్టేషన్స్ గుర్తింపు పోటీ చేసే అభ్యర్థులు వారికి కేటాయించిన గుర్తులు పోలింగ్ స్టాఫ్ విధులు ఓటర్లు ఓటు వేసే విధానం రహస్య పద్ధతిలో ఓటు హక్కు వినియోగం మహిళా పోలింగ్ కేంద్రం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 30వ తేదీన జరగబోయే సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు ఏ విధంగానైతే ఓటు హక్కు వేయించుకుంటారనే పద్ధతిలో మాదిరి పోలింగ్ ప్రక్రియను విద్యార్థులు చాలా చక్కగా నిర్వహించారని అభినందించారు. 6 నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్నికల ప్రక్రియ పై అవగాహన కలిగి ఉండటం వల్ల బాధ్యత ఓటలగా తయారవుతారని చెప్పారు. ఈ పాఠశాలలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీసం సురక్షిత తాగునీరు, విద్యుత్, ర్యాంపులు, వీల్ చైర్లు, మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం విద్యార్థులకు ఆప్యాయంగా పలకరించి ఎన్నికల ప్రక్రియను చాలా బాగా నిర్వహించాలని అభినందించారు. జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతుందని విషయం కూడా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి త్రినాథ్ బాబు, మెంబర్స్ పూసపాటి సాయి కృష్ణ, మండల విద్యాధికారి శ్రీరామ్మూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంగమ్మ, ఉపాధ్యాయులు, రత్నకుమారి, ఎస్.శ్రీనివాస్, డి.శ్రీనివాస్, కృష్ణమోహన్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో ఆరోగ్యశాఖ తనిఖీలు

- లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు

నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జెవిఎల్.శిరీష ఆదేశాల మేరకు డీఎంఅండ్ హెచ్ఓ కార్యాలయం అధికారులు గురువారం కొత్తగూడెం పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్స్‌లో తనిఖీలు చేశారు. డిప్యూటీ డెమో ఎండి.ఫైజ్ మోహియుద్దీన్ ఆధ్వర్యంలో పాల్వంచ, కొత్తగూడెంలోని పలు స్కానింగ్ సెంటర్లను, ల్యాబ్ లను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చట్ట విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రామవరం ఎంసిఎచ్ సెంటర్‌ను సందర్శించారు. ఆర్ఎంఓ డాక్టర్ వీరబాబుని కలిసి స్కానింగ్ సెంటర్ వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

- పాగి వెంకన్న కళాజాత బృందాలు

అవగాహన కార్యక్రమాలు

నవతెలంగాణ-కొత్తగూడెం

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కళాబృందాల ద్వారా ప్రచారం నిర్వహించారు. గురువారం చుంచుపల్లి మండలంలోని చుంచుపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రియాంక అల ఆదేశంతో తహసీల్దారు పర్యవేక్షణలో జిల్లా పౌర సంబంధాల శాఖ శీలం శ్రీనివాసరావు నేతృత్వంలో తెలంగాణ సాంస్కృతిక సారథి పాగి వెంకన్న తన బృందంతో కార్యక్రమాలు చేశారు. బృందం ఆట, పాటలతో విద్యార్థిని విద్యార్థులను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో



ఎంపిడిఓ మందా మంగమ్మ, ఎంపిఓ గుంటి సత్యనారాయణ, కాలేజ్ ప్రిన్సిపల్ కె.రమేష్, పంచాయతీ కార్యదర్శి బొంతు బాబురావు, ఆర్ఐ గుగులోత్ మంగ్య, కాలేజ్ జూనియర్ లెక్చరర్స్ జె.రమేష్ బాబు, కె.సతీష్, బి.వెంకటేశ్వర్ రావు, వి.సునీల్ కుమార్, ఎం.సుశీల్, ఎస్.శ్రీనివాస్, బి.లక్ష్మణ్, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాశాల బృందం పాగి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు వినియోగించుకోండి

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల కేంద్రంలో సబ్ పోస్ట్ ఆఫీస్ నందు జిల్లా ఏఎస్పీ అధికారి రంజిత్ కుమార్ చౌదరి ఆధ్వర్యంలో పోస్టల్ డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్ట్ ఆఫీస్‌కి సంబంధించిన పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ మెయిల్ ఓవరిసీర్స్ సత్యనారాయణ, రాజేందర్ నాయక్, అసిస్టెంట్ పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండలంలో పలువురు బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో గురువారం చేరారు. మండల బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి నెరళ్ళ లాలయ్యతో పాటు రాజపురం గ్రామానికి చెందిన జిగురు రాము, బుడుపుల వెంకటేశ్వరావు, పిల్లి కృష్ణ, వేముల వెంకటేశ్వరావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ గురువు అని వారి ఆధ్వర్యంలో అశ్వారావుపేట నియోజక వర్గం శాసన సభ అభ్యర్థి జారే ఆదినారాయణ గెలుపు కోసం పని చేస్తాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో దుబాకుల రాము, భీమిరెడ్డి వెంకటరామిరెడ్డి, కుమార్, గణపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేటీపీఎస్‌లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన

- డీపీఆర్ఓ శ్రీనివాసరావు

నవతెలంగాణ-పాల్వంచ



పోలింగ్ శాతాన్ని పెంచేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు డీపీఆర్ఓ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం కేటీపీఎస్ కర్మాగారంలో ఓటు హక్కు వినియోగం పై ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జిల్లాలో 166 పోలింగ్ కేంద్రాలల్లో గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ నమోదయిందని, ఆయా కేంద్రాల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు జిల్లా ఎన్నికల అధికారి పర్యవేక్షణలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికలల్లో జరిగే ఏదేని అక్రమాలకు సి విజిల్, 1950 కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఫోన్ చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శ్వీప్ నోడల్ అధికారి త్రినాథ్ బాబు, పరిశ్రమల మేనేజర్ సీతారాం, కేటీపీఎస్ సీఈ సత్యనారాయణ, ఎస్ఈ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పొత్తు ధర్మాన్ని విస్మరిస్తే మూల్యం తప్పదు

- సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రవికుమార్

నవతెలంగాణ-దుమ్ముగూడెం

పొత్తు ధర్మాన్ని విస్మరిస్తే కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించుకోక తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి వరకు సభ్యులు రావులపల్లి రవికుమార్ హెచ్చరించారు. గత ఎన్నికల్లో భద్రాచలం అసెంబ్లీ స్థానం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సమయంలో ఆయన గెలుపు కోసం సీపీఐ కీలక పాత్ర పోషించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గురువారం నర్సాపురం గ్రామంలో తాటిపూడి రమేష్ అధ్యక్షతన జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పొత్తుల భాగంగా సీపీఐకి కొత్తగూడెం కేటాయించారని, భద్రాచలం సెట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న పొదెం వీరయ్య సైతం పొత్తుతోనే ఎన్నికల్లోనికి వెళ తున్నారని గుర్తు చేశారు. కొన్ని లోపాయికారి ఒప్పందాలతో కాంగ్రెస్ పార్టీ పొత్తు ధర్మాన్ని మరుస్తున్నారని, కొత్తగూడెంలో సైతం పొత్తులో ఉంటూనే అక్కడి కాంగ్రెస్ కార్యకర్తలు దొంగదార్లు వెతుక్కుంటున్నారని ఆరోపించారు. పొత్తు ఉండగానే సీపీఐకి చెందిన కార్యకర్తలను ఏ ఉద్దేశ్యంతో కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారో ఎమ్మెల్యే భేషరతుగా చెప్పాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి నోముల రామిరెడ్డి, కిలిమి ఎల్లారెడ్డి, మందపాటి సుధాకర్ రెడ్డి, వర్సా గౌరయ్య, బొల్లోజు వేణు, కాకా వెంకటేశ్వరావు, అమరవాది శంకర్, కుంజా లక్ష్మయ్య కొటేష్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.50 వేలు విరాళం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం జూనియర్ కళాశాల సెంటర్లో ఉన్న శ్రీ సాయి బాబా వారి మందిరంలో గురువారం బాబా వారికి ఉదయ అభిషేకం అర్చనలు జరిపారు. స్వర్ణ ఆభరణాలు, నూతన వస్త్రాలు అలంకరించారు. భద్రాచల పట్టణానికి చెందిన నాదెళ్ల శ్రీనివాసరావు (కోళ్ల శ్రీను) కీర్తిశేషులు వారి తండ్రి నాదెళ్ల నాగేశ్వరరావు అన్నపూర్ణ, వారి సోదరుడు నాదెళ్ల భాస్కరరావు జ్ఞాపకార్థం గురువారం అన్నదానం కోసం రూ.50వేలు విరాళం అందజేశారు. దాతలను ఆలయ సభ్యుడు గొర్ల వెంకటేశ్వరావు శాలువాతో సత్కరించి బాబా వారి మెమెంటో అందజేశారు. గురువారం 1400 మంది స్వాములు, భక్తులు బాబా వారి అన్నప్రసాదం స్వీకరించారని అధ్యక్షులు తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేసీఆర్ ముఖ్యమంత్రిగా హ్యాట్రిక్ సాధిస్తారు

నవతెలంగాణ-మణుగూరు

కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా హ్యాటిక్ సాధిస్తారని, భద్రాద్రి రాముని ఆశీస్సులతో సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తారని, పాత సీసాలో కొత్త సార నింపిన విధంగా కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఉందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. గురువారం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ 241 బూత్‌లలో దద్దరిల్లేలా బీఆర్ఎస్ పార్టీ ప్రచారం జరుగుతుందన్నారు. పనికిమాలిన వారిని, పని చేతగాని వారిని, ప్రజలపై ప్రేమ లేనటువంటి వాళ్ళని, పనిచేయాలనే తపన లేని వారిని గెలిపించాలని ప్రజలు అనుకోవడం లేదన్నారు. వారిని గెలిపిస్తే లెటర్ ప్యాడ్ కోసం అశ్వాపురం, సంతకం కోసం ఖమ్మం వెళ్లాల్సిన గత్యంతరం పడుతుందన్నారు. ప్రజలు తమ ఓటును కారు గుర్తుకు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

పొదెం వీరయ్యకు టీడీపీ సంపూర్ణ మద్దతు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

రానున్న అసెంబ్లీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సూచన మేరకు భద్రాచలం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యకర్తల అభిప్రాయాన్ని గౌరవిస్తూ ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పొదెం వీరయ్యకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తుందని ఆ పార్టీ నాయకులు ఎస్కే అజీమ్, కొడాలి శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురువారం కొడాలి శ్రీనివాస్ నివాసగృహంలో జరిగిన తెలుగుదేశం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పొదెం వీరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్కే అజీమ్, కొడాలి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వంలో భద్రాచలానికి రూ.1100 కోట్లు ప్రకటించి రూ.11 ఇవ్వలేదని



విమర్శించారు. భద్రాచలాన్ని భద్రాచల సీతారామచంద్రస్వామి దేవస్థానం పూర్తిగా విస్మరించారని బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ వచ్చిన భద్రాచలాన్ని అభివృద్ధి చెయ్యరని ఉద్దేశంతో తెలుగుదేశం పార్టీ కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తుందని అన్నారు. టిడిపి హయాంలో మాత్రమే భద్రాచలం అభివృద్ధి చెందిందని ఆ సమయంలో తెలుగుదేశం పార్టీలో తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా, బాలసాని లక్ష్మీనారాయణ కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్‌గా ఉండి భద్రాచల అభివృద్ధిలో వీళ్ళ సహాయ సహకారాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఇప్పుడు తుమ్మల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ కాంగ్రెస్ పార్టీలో చేరారని, రేపు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మంపాటి సురేష్ కుమార్, కుంచాల రాజారాం, కోనేరు రాము, అభినేని శ్రీనివాస్, తాళ్లూరి చిట్టిబాబు, రాఘవయ్య, అడుసు మల్లి జగదీష్, మేడిపల్లి మల్లికార్జునరావు, కోడూరి సత్యనారాయణ, పరిమి సుబ్బారావు, పరిమి సోమశేఖర్, నాగేశ్వరరావు, పోటు వెంకటేశ్వరరావు, దాసయ్య, బోడిపూడి కృష్ణమూర్తి, శ్రీనివాస్, హరీష్, చిన్ను, కొడాలి చంటి, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ బంధువు కేసీఆర్

బీఆర్ఎస్ పాలేరు అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి

నవతెలంగాణ -కూసుమంచి

వికలాంగుల ఆత్మీయ బంధువు ముఖ్యమంత్రి కేసీఆర్ అని బీఆర్ఎస్ పాలేరు అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జీళ్లచెరువు గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వికలాంగుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వికలాంగులందరికీ ఆత్మబంధువై పెన్షన్ రూ.4,016 చేశారని, ఎన్నికల అనంతరం రెట్టింపు చేసే బాధ్యతను కేసీఆర్ తీసుకున్నారని తెలిపారు. రాష్ట్ర వికలాంగుల చైర్మెన్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాల వారిని ఆదుకునే నాయకుడు గొప్ప మనసున్న వ్యక్తి కేసీఆర్ అని, పాలేరు నియోజకవర్గంలో కూడా మనసున్న వ్యక్తి ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఆయనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్, వైస్ ఎంపీపీ కంచర్ల పద్మ, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మా సంపూర్ణ మద్దతు సండ్రకే

నవతెలంగాణ-సత్తుపల్లి

మాదిగజాతి ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకుండా కాంగ్రెస్ పార్టీ ఆదినుంచి అడ్డుపడుతోందని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండారు వీరబాబు అన్నారు. అంబేద్కర్ యువజన సంఘం, ఉస్మానియా యూనివర్శిటీ జేఏసీ, ఎమ్మార్పీఎస్, టీ-ఎమ్మార్పీఎస్ సంఘాలకు చెందిన నాయకులు గురువారం సత్తుపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్యను కలిసి తమ పూర్తి మద్దతును ప్రకటించారు.

ఏ పార్టీ అయితేనేమి టికెటే లక్ష్యం

9వ సారి ఎన్నికల బరిలో వనమా

- 4 పర్యాయాలు ఓటమి.. 4 సార్లు విజయం
- 4 సార్లు కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపైనే విజయం
- తొలిసారిగా కారు గుర్తుపై ఎన్నికల బరిలో
- నేడే వనమా నామినేషన్ దాఖలు
- వనమా వెంకటేశ్వరరావుకు కొరకరానికి కొయ్యగా తనయుడి వ్యవహారం..?
- కారు గుర్తును ఓటర్లు ఆదరించేనా.?

నవతెలంగాణ-పాల్వంచ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న ఐదు నియోజకవర్గాల్లో నాలుగు నియోజకవర్గాలు ఎస్టీ రిజర్వేషన్ కావడంతో అందరి దృష్టి జనరల్ సీటు అయిన కొత్తగూడెం పైనే ఉంటుంది. ఈ నియోజకవర్గంలో ఇప్పటివరకు 13 సార్లు ఎన్నికలు జరిగాయి. 14వ సారి ఈనెల 30న జరగనున్న నేపథ్యంలో అందరి దృష్టి, కొత్తగూడెం పైనే ఉంది అధికార పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు 9వ సారి ఎన్నికల బరిలో దిగుతున్నారు. శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు.

పాల్వంచ నియోజకవర్గం నుంచి కొత్తగూడెం నియోజకవర్గంగా ఏర్పడిన 1978వ సంవత్సరంలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగిన వనమా వెంకటేశ్వరరావు జనతా పార్టీ నుంచి పోటీ చేసిన చేకూరి కాశయ్య చేతిలో పరాభవం చెందాడు. అప్పటి నుంచి ప్రతి సర్వత్రిక ఎన్నికల్లో వనమా వెంకటేశ్వరరావు పోటీ చేస్తూ వస్తున్నారు. నాలుగు పర్యాయాలు పరాజయం పాలై నాలుగు సార్లు విజయం దుందుభి మోగించారు. 1978లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున వనమా వెంకటేశ్వరరావుకు 21,761 ఓట్లు రాగా జనతా పార్టీ నుంచి పోటీ చేసిన చేకూరి కాశయ్య 32409 ఓట్లు సాధించి గెలుపొందారు. 1989లో కాంగ్రెస్ నుంచి వనమా వెంకటేశ్వరరావు పోటీ చేసి 49,514 ఓట్లు సాధించగా తెలుగుదేశం నుంచి పోటీ చేసిన కోనే నాగేశ్వరరావుకు 49,117 ఓట్లు రావడంతో స్వల్ప ఆధిక్యతతో వరమా వెంకటేశ్వరరావు విజయం సాధించారు. 1994లో కాంగ్రెస్ పార్టీ నుంచి వనమా వెంకటేశ్వరరావు పోటీ చేస్తే కోనే నాగేశ్వరరావు తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేశారు. కోనేరు నాగేశ్వరరావుకు 67,104 ఓట్లు రాగా కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన వనమాకు 46,117 ఓట్లు రావడంతో పరాజయం పాలయ్యారు. 1999లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి వనమా వెంకటేశ్వరరావు పోటీ చేస్తే 60,632 ఓట్లు, తెలుగుదేశం నుంచి పోటీ చేసిన నాగవాణికి 43,918 ఓట్లు రావడంతో వనమా విజయం సాధించారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి వనమా వెంకటేశ్వరరావు 76,333 ఓట్లు సాధించగా తెలుగుదేశం పార్టీ నుంచి కోనే నాగేశ్వర రావు 48,561 రావడంతో వనమా విజయం సాధించి 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి వనమా వెంకటేశ్వరరావు పోటీ చేసిన 45,024 ఓటు రాగా సీపీఐ నుంచి పోటీ చేసిన సాంబశివరావుకు 47,023 ఓట్లు సాధించి కూనంనేని విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ నుంచి జలగం వెంకట్రావు పోటీ చేసి 50,688 ఓట్లు సాధించగా వైయస్సార్ సిపి నుంచి పోటీ చేసిన వనమా వెంకటేశ్వరరావు 23,167 ఓటు సాధించి పరాజయం పాలయ్యారు. అభివృద్ధి మంత్రం పేరుతో కాంగ్రెస్ పార్టీకి నియోజకవర్గ ఓటర్లకు ద్రోహం చేసి గులాబీ కండువా కప్పుకున్నారు. అంటే గెలుపొందిన నాలుగు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపైనే విజయం సాధించారు. 9వ సారి తొలిసారిగా కారు గుర్తుపై ఎన్నికల బరిలో దిగిన వనమా వెంకటేశ్వరరావును ఓటర్లు ఎలాంటి తీర్పు ఇస్తారో వేచి చూడాలి. ఒకవైపు అధికార పార్టీపై తీవ్ర అసంతృప్తి, మరోవైపు తనయుడు రాఘవేంద్రరావుపై అవినీతి, అక్రమాల ఆరోపణలు రామకృష్ణ కుటుంబం ఆత్మహత్య కేసు షాడో ఎమ్మెల్యేగా పెత్తనం పార్టీలో అసంతృప్తి కాంగ్రెస్ గుర్తుకు దూరం కావడం వలన వెంకటేశ్వరరావు గెలుపోటములు నల్లేరు మీద నడికే అని చెప్పవచ్చు



పార్టీతో పని ఏంటి..

వనమా వెంకటేశ్వరరావుకు పార్టీతో నమ్మిన సిద్ధాంతంతో పనిలేదు. తనకు ఎన్నికల్లో సీటు ఇవ్వకుంటే సీటు ఇచ్చే ఏ పార్టీలోకైనా జంపు జిలాని అవుతారు. అదే క్రమంలో 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సీటు ఇవ్వకపోవడంతో వైయస్సార్సీపి తీర్థం పుచ్చుకొని ఎన్నికల బరిలో దిగారు. దీంతో ఆయన వైఖరిని వ్యతిరేకించిన నియోజకవర్గ ఓటర్లు టిఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసినా జలగం వెంకట్రావుకు పట్టం కట్టారు. 2014 ఎన్నికల్లో వైయస్సార్సీపికి గుడ్ బై చెప్పి తిరిగి ఎన్నికల్లో సీటు కోసం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటి వరకు ఐదు సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీ జెండా మోసి నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను కాపాడిన ఎడవల్లి కృష్ణకు వనమా వెంకటేశ్వరరావు వెన్నుపోటు పొడిచారని ఆరోపణలు ఉన్నాయి. కాంగ్రెస్ సీటు ఇస్తే గెలుపొంది పార్టీకి పంగనామాలు పెట్టి కారెక్కారు. కాగా ఇప్పుడు వనమా వెంకటేశ్వరరావు కారు గుర్తుపై పోటీ చేస్తున్నారు. మరి ఓటర్ దేవుళ్ళు ఎలాంటి తీర్పిస్తారు వేచి చూడాలి.

దళిత, బీసీ, మైనార్టీ బందు పథకాలతో తలనొప్పి

బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న దళిత బంధు, బీసీ బందు, మైనారిటీ రుణాల్లో తనయుడి చేతివాటం వనమా వెంకటేశ్వరరావుకు తీరని తలనొప్పిగా మారింది. తన అనుచరులతో వనమా రాఘవేంద్రరావు నియోజకవర్గ వ్యాప్తిగా దళిత బందు పథకం లబ్ధిదారుల ఎంపిక రూ.3 లక్షలు, బీసీ రుణాలకు 35,000, మైనార్టీ రుణాలకు 30,000 చొప్పున వందల మంది దగ్గర వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. పథకాలు మంజూరు కాకపోవడంతో డబ్బులు ఇచ్చిన వారు వనమా రాఘవ ఏజెంట్ల ఇంటి చుట్టూ ప్రదర్శనలు చేస్తున్నారు. ప్రచార రథానికి పలు గ్రామాల్లో అడ్డుపడుతూ దళిత, బిసి, మైనార్టీ రుణాలు ఏమయ్యాయని నిలదీయడంతో సమాధానం చెప్పకుండా వెని తిరగడం చూస్తుంటే దీంతో ఈ సారి అధికార పార్టీకి చుక్కెదురేనా.. అని చెప్పక తప్పదు.

ఇటీవల కొత్తగూడెం మున్సిపల్ కౌన్సిలర్లను రాఘవేంద్రరావు తీవ్రంగా అవమానించడంతో వారు అల్టిమేట్ జారీ చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎమ్మెల్యే కుమారుడు వనమా రాఘవేంద్రరావు వ్యవహారం వనమా వెంకటేశ్వరరావుకు కొరకరాని కొయ్యగా మారింది.

ఓటమి భయంతోనే ఐటీ దాడులు

పాలేరు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాసరెడ్డి

- క్యాంపు కార్యాలయం నుండి భారీ ర్యాలీగా వెళ్ళి నామినేషన్
- నామినేషన్‌కు హాజరైన తుమ్మల, కూనంనేని

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

నిర్బంధాలు, ఐటీ దాడులతో కాంగ్రెస్ గెలుపును ఆపలేరు... విజయం సాధించలేరని పాలేరు అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయం నుండి భారీ ర్యాలీగా వెళ్లి ఖమ్మం రూరల్ తహశీల్దారు కార్యాలయంలో గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఐటీ దాడుల నేపథ్యంలో తీవ్ర ఉత్కంఠ మధ్య ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో కలిసి వెళ్లి నామినేషన్ వేశారు. గురువారం తెల్లవారుజామున 3 గంటల నుండి పొంగులేటికి సంబంధించిన నివాసాలపై ఈడీ, ఐటీ దాడులు ప్రారంభించింది. గురువారం ఉదయం 10.30 గంటలకు నామినేషన్ ప్రక్రియ ఉంటుందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముందే ప్రకటించారు. ఈ నేపథ్యంలో అకస్మాత్తుగా గురువారం ఉదయం 3 గంటల సమయంలో ఐటి అధికారులు సోదాలు నిర్వహించేందుకు రావడంతో కాంగ్రెస్ శ్రేణులు, పొంగులేటి అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఉదయం ఏడు గంటల సమయంలోనే పార్టీ శ్రేణులు ఐటీ దాడులను నిరసిస్తూ శ్రీనివాసరెడ్డి నివాసం వద్ద ఆందోళనకు దిగారు. ఎన్నికల సంఘం జోక్యంతో 10.40 గంటలకు ఐటీ అధికారులు శ్రీనివాసరెడ్డిని నామినేషన్ వేసేందుకు అనుమతించడంతో కాంగ్రెస్ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నాయి.

ర్యాలీగా వెళ్లి నామినేషన్...

తీవ్ర ఉద్రిక్తత మధ్య పొంగులేటి తన అభిమానులతో కలిసి ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. రోటరీనగర్, ఇందిరానగర్,



ఇల్లందు క్రాస్ రోడ్, జడ్పీ సెంటర్, మయూరిసెంటర్, ఫ్లైఓవర్ బ్రిడ్జి కాలువొడ్డు మీదుగా రూరల్ తహశీల్దారు కార్యాలయం వద్దకు చేరుకొని పాలేరు నియోజకవర్గ అభ్యర్థిగా నామినేషన్ వేశారు.

ఓటమి భయంతోనే దాడులు

ఓటమి భయంతోనే తనపై ఐటి దాడులు నిర్వహిస్తున్నారని పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుందన్నారు. అందుకే బీజేపీతో కలిసి కాంగ్రెస్ శ్రేణులపై దాడులు చేయిస్తోందన్నారు. సోదాలకు తాము భయపడేది లేదని, తాము ఎలాంటి తప్పు చేయనప్పుడు భయపడాల్సిన అవసరం ఏమాత్రం లేదని పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ ఎస్ కొనసాగిస్తున్న అసమర్థ పాలనకు చరమగీతం పాడి కాంగ్రెస్ పాలనకు బీజం వేయాలన్నారు. తద్వారా ఇందిరమ్మ పాలనను సాధించుకోవాలని పొంగులేటి కోరారు. డిసెంబర్ 9న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, తదనంతరం ఆరు గ్యారెంటీలు అమలు చేసి ప్రజలందరికీ మరింత చేరువ అవుతుందని పేర్కొన్నారు. పొంగులేటి వెంట కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్ బాబు, తుళ్లూరు బ్రహ్మయ్య, మద్దినేని బేబీ స్వర్ణకుమారి, ఆర్. నరేష్ రెడ్డి, బండి జగదీష్, సీపీఐ నాయకులు దండి సురేష్ ఉన్నారు.

పాలేరులో ఎర్రజెండా ఎగరడం ఖాయం

- సీపీఐ(ఎం) పాలేరు నియోజకవర్గ అభ్యర్థిగా తమ్మినేని వీరభద్రం నామినేషన్ దాఖలు

నవతెలంగాణ- ఖమ్మంరూరల్

పాలేరులో ఎర్రజెండా ఎగరడం ఖాయమని సీపీఐ(ఎం) పాలేరు నియోజకవర్గ అభ్యర్థి తమ్మినేని వీరభద్రం అన్నారు. పాలేరు సీపీఐ(ఎం) అభ్యర్థి తమ్మినేని వీరభద్రం నామినేషన్ వేడుక గురువారం అట్టహాసంగా జరిగింది. పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మంరూరల్, కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాల్లోని సీపీఎం శ్రేణులు ఎర్ర చొక్కాలు, మహిళలు ఎర్ర చీరలు ధరించి భారీ సంఖ్యలో నామినేషన్‌కు హాజరయ్యారు. ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్లో భారీ బహిరంగ సభ అనంతరం పెవిలియన్ గ్రౌండ్ నుంచి భారీ ర్యాలీగా తల్లి తమ్మినేని కమలమ్మతో నడుచుకుంటూ ఖమ్మంరూరల్ తహశీల్దార్ కార్యాలయంలో తమ్మినేని నామినేషన్ పత్రాలను అందజేశారు. నామినేషన్ అనంతరం తమ్మినేని మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకలను చట్టసభల్లోకి పంపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నామినేషన్ కార్యక్రమానికి మేము ఊహించిన దాని కంటే మహిళలు, యువకులు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారన్నారు. తన విజయం ఖాయంగా భావిస్తున్నా అని అన్నారు. ఎన్నో కష్టనష్టాలు ఓర్చి ఉద్యమాలు నిర్మించిన చరిత్ర నాకుంది అన్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా నాలుగు వేల రెండొందల కిలోమీటర్ల పొడవునా పాదయాత్ర చేశానని అన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన ఉద్యమాల్లో క్రియాశీలకంగా ఉన్నానని, ఆనాడు నైజాంకు వ్యతిరేకంగా తన తండ్రి పోరాడారని అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా అవిశ్రాంతంగా పనిచేస్తున్న చరిత్ర నాకుందని, ఇవన్నీ పరిగణనలోకి తీసుకుని సీపీఐ(ఎం)కు ఓటేయాలన్నారు. రాబోయే ఇరవై రోజులు కార్యకర్తలు అవిశ్రాంతంగా పని చేసి తనను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, బి.వెంకట్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పాలేరు నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్, సిపిఎం ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, కూసుమంచి మండల కార్యదర్శి రమణారెడ్డి, తిరుమలయాపాలెం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నేలకొండపల్లి మండల కార్యదర్శి కేవీ రెడ్డి, తెల్దారుపల్లి సర్పంచ్ సిద్దినేని కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమస్త తెలుగు వేదిక
ఖమ్మం
శుక్రవారం నవంబర్ 10 2023 www.navatelangana.com

ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల ఫిర్యాదులు తెలియజేయాలి

• ఎన్నికల జనరల్ అబ్జర్వర్ తుషార్ కాంత మహంతి



నవతెలంగాణ-ఖమ్మం

అసెంబ్లీ సాధారణ ఎన్నికల దృష్ట్యా ఖమ్మం, పాలేరు నియోజకవర్గాలకు సంబంధించిన ఫిర్యాదులు ఏమైనా ఉన్నట్లైతే తనకు తెలియజేయాలని సాధారణ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ తుషార్ కాంత మహంతి తెలిపారు. గురువారం ఖమ్మంలోని ఆఫీసర్స్ గెస్ట్ హౌజ్‌లో ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల సాధారణ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల దృష్ట్యా ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, పాలేరు నియోజకవర్గాలలో ఎన్నికలకు సంబంధించిన ఉల్లంఘనలు, ఫిర్యాదులు ఏమైనా ఉన్నట్లైతే, వాటిని స్వయంగా స్వీకరించడానికి మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఖమ్మంలోని ఆఫీసర్స్ గెస్ట్ హౌజ్‌లో (ఎన్ఎస్పి గెస్ట్ హౌజ్) అందుబాటులో ఉంటానని తెలిపారు. అదే విధంగా ఫోన్ నెంబర్ 9346293006 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని, తనకు వచ్చే ఫిర్యాదులపై స్పందించి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఎవరైనా ఫిర్యాదు చేయదలచిన వారు స్వయంగాగాని లేదా ఫోన్ ద్వారాగాని ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.

జనరల్ అబ్జర్వర్‌ను కలిసిన కలెక్టర్, సీపీ

నవతెలంగాణ-ఖమ్మం



అసెంబ్లీ సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని 112-ఖమ్మం, 113- పాలేరు అసెంబ్లీ నియోజకవర్గాలకు జనరల్ అబ్జర్వర్‌గా నియమింపబడిన తుషార్ కాంత మహంతిని గురువారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి.గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా సమాచారంతో పాటు జిల్లాలోని నియోజకవర్గాలు, రిటర్నింగ్ అధికారులు, సహాయ వ్యయ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ బృందాల సమాచారాన్ని జనరల్ అబ్జర్వర్‌కు వివరించారు. ఎన్నికల సన్నద్ధతపై చేపట్టిన చర్యల గురించి వివరించారు. జిల్లా ఎన్నికల నిర్వహణ కార్యాచరణను జనరల్ అబ్జర్వర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, జిల్లా పౌరసరఫరాల అధికారిణి శ్రీలత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ(ఎం) అభ్యర్థి పాలడుగు భాస్కర్ నామినేషన్

నవతెలంగాణ-బోనకల్

సీపీఐ(ఎం) మధిర నియోజకవర్గ అభ్యర్థి పాలడుగు భాస్కర్ శుక్రవారం మధిరలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు మధిర నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెరువు కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నామినేషన్ కార్యక్రమం సందర్భంగా మధిరలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ బహిరంగ సభకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు బొడ వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, సుంకర వీరయ్య, చుక్క రాములు, సిఐటియూ జాతీయ నాయకులు మందడపు సాయిబాబు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బండి పద్మ తదితరులు హాజరవునున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు, నామినేషన్‌కు మధిర నియోజకవర్గంలోనే ఐదు మండలాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ముదిగొండ : మధిర నియోజకవర్గ సిపిఐ(ఎం) అభ్యర్థి పాలడుగు భాస్కర్ నామినేషన్ శుక్రవారం మధిరలో వెయ్యనున్నట్లు సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం గురువారం తెలిపారు. పాలడుగు భాస్కర్ నామినేషన్ సందర్భంగా మధిరలో జరిగే ర్యాలీ, బహిరంగసభకు మండలంలోని వివిధ గ్రామాల నుండి పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాసంఘాల బాధ్యులు, సానుభూతిపరులు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

తుమ్మల గెలుపు కోసం జోరుగా ప్రచారం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాజా శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం 39వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి తుమ్మల గెలుపు కోసం డివిజన్ మొత్తం తిరుగుతూ జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షేక్ ఇమామ్, షేక్ వసీం, సయ్యద్ అహ్మద్, సయ్యద్ వాజిద్, ఫయాజ్, గౌస్ పాషా, షేక్ అబ్దుల్, మధారి సైదారావు, షేక్ జానీ మియా, పాలకుర్తి వెంకన్నబాబు, బాలసు నాగేశ్వరావు, రెహమాన్, తాజుద్దీన్, రవీంద్ర, ఖాదర్, ఇబ్రహీం, ఖాజా, ముజ్జు, తిరుపతిరావు, సిహెచ్..శ్రీనివాస్, రియాజ్, రంజాన్, అన్వర్, అక్రమ్, యాకూబ్, అఫ్జల్, సంపత్,సాయి, మహేష్, నాగుల్, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు మాధురి, ఉదయ్ శ్రీ, భార్గవి, చంద్రిక, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందులో 8 నామినేషన్లు దాఖలు

నవతెలంగాణ-ఇల్లందు

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇల్లందు నియోజకవర్గంలో గురువారం 8 నామినేషన్లు దాఖలు అయినట్లు రిటర్నింగ్ అధికారి కాశయ్య తెలిపారు. సీపీఐ(ఎం) అసెంబ్లీ అభ్యర్థిగా దుగ్గి క్రిష్ణ గురువారం రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా రమణాల లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కోరం కనకయ్య రిటర్నింగ్ అధికారికి బీఫామ్ అందజేసి నామినేషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా రాంబాయి అలియాస్ హరిప్రియ బానోత్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా ముక్తిరాజు నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ పార్టీ అభ్యర్థిగా ధరావత్ రవీంద్ర నాయక్, స్వతంత్ర అభ్యర్థిగా సువర్ణపాక వెంకటేశ్వర్లు, స్వతంత్ర అభ్యర్థిగా మెస్సు ఉషారాణి నామినేషన్ దాఖలు చేశారు.

కలిసి పనిచేయడం చారిత్రిక అవసరం

• సీపీఐ మద్దతు కోరిన తుమ్మల

నవతెలంగాణ-ఖమ్మం



దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో సీపీఐ కాంగ్రెస్ పార్టీలు కలిసి పనిచేయడం చారిత్రిక అవసరమని మాజీ మంత్రి, కాంగ్రెస్ ఖమ్మం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దేశంలో మతాలవారీగా, కులాలవారీగా విభజన జరుగుతుందని, ఇటువంటి సమయంలో బీజేపిని గద్దెదించేందుకు కాంగ్రెస్ వామపక్షాలతో కలిసి ఇండియా పేరుతో కూటమిగా ఏర్పడ్డాయన్నారు. గురువారం ఖమ్మంలోని సీపీఐ కార్యాలయానికి వెళ్ళి ఆ పార్టీ మద్దతు కోరి పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకోసం బడుగు, బలహీనవర్గాల జీవితాలలో మార్పుకోసం పనిచేస్తున్న కమ్యూనిస్టులు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకోవడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్‌ను గద్దెదించేందుకు సిపిఐ, కాంగ్రెస్‌లు ఈ ఎన్నికల్లో ఒక అవగాహనతో పోటీ చేస్తున్నాయని, కొత్తగూడెంలో సిపిఐ అభ్యర్థి, రాష్ట్రపార్టీ కార్యదర్శి కూనంనేని సాంబశివరావును కాంగ్రెస్ బలపరుస్తుందన్నారు. ఎన్నికలకు మరో 20 రోజులు మాత్రమే సమయం ఉందని అరమరికలు లేకుండా కలిసి ఖమ్మం జిల్లాలో 10కి పది స్థానాలను గెలిపించుకుందామన్నారు. రాష్ట్రంలో మునుగోడులో అవసరానికి వాడుకొని బిఆర్ఎస్ కమ్యూనిస్టులను వదిలేసిందని తుమ్మల తెలిపారు. ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్, బీజేపిలను ఓడించేందుకు సీపీఐ(ఎం) కూడా కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ తమకు పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మాట్లాడుతూ పార్టీల ఒప్పందాల మేరకు కలిసి పనిచేస్తామన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో తుమ్మల నాగేశ్వరరావుతో పాటు, జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాలలో కలిసి పనిచేసి ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకునేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తామని ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమీషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యవర్గసభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఎస్‌కె. జానిమియా, కొండపర్తి గోవిందరావు, ఏపూరిలతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, పోటు కళావతి, సిహెచ్. సీతామహలక్ష్మి, తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు మానుకొండ రాధాకిషోర్, మహ్మద్ జావీద్, సాదు రమేష్‌రెడ్డి, బిక్కసాని నాగేశ్వరరావు, శెట్టి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కమల్ రాజును గెలిపించాలి

నవతెలంగాణ-ముదిగొండ

బీఆర్ఎస్ నియోజకవర్గం అభ్యర్థి లింగాల కమల్ రాజు విజయాన్ని కాంక్షిస్తూ మండల కేంద్రమైన ముదిగొండలో గురువారం ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలతో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మందరపు లక్ష్మీ మాట్లాడారు. ఈ నెల 30న జరిగే పోలింగ్లో లింగాల కమల్ రాజు గుర్తు కారు గుర్తుపై అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు తేరాల రామారావు, పంచాయతీ వార్డు సభ్యులు రొంపిచర్ల సత్యవాణి, నాయకులు వాకధాని కనకయ్య షేక్ ఖాజా, యుగంధర్ పుచ్చకాయల భూషయ్య, రవి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ-కామేపల్లి

కామేపల్లి మండలం జోగుగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీలో బట్టు శంకర్ నాయక్, సర్పంచు జరపల భగవాన్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. హరిప్రియ గెలుపుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తమ్మినేని నామినేషన్‌కు భారీగా బయలుదేరిన సీపీఐ(ఎం) శ్రేణులు

నవతెలంగాణ-కూసుమంచి

సీపీఐ(ఎం) పాలేరు నియోజకవర్గ అభ్యర్థిగా తమ్మినేని వీరభద్రం నామినేషన్ సందర్భంగా గురువారం మండల వ్యాప్తంగా గ్రామ గ్రామాల నుండి భారీ ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు భారీ ఎత్తున ఖమ్మం బయలుదేరారు. గ్రామాలలో ఎర్రజెండా రెపరెపలే కనిపించాయి. మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ పంచాయతీల నుండి బయలుదేరి మండల వ్యాప్తంగా వందలాదిమందితో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఖమ్మం లోని పెవిలియం గ్రౌండ్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభ అనంతరం తమ్మినేని నామినేషన్ ప్రక్రియకు బయలుదేరిన ర్యాలీ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది.

బీఆర్ఎస్, బీజేపీ కనుసన్నల్లోనే కాంగ్రెస్ నేతల ఇండ్లలో సోదాలు

రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

నవతెలంగాణ-ఇల్లందు



మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంటిపై ఐటి దాడులు నిర్వహించడం పట్ల జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య నిరసన వ్యక్తం చేశారు. సుభాష్ నగర్ సెంటర్లో నాడు 4 కూడళ్ళ మధ్య రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ఓటమి భయంతోనే బీజేపీ పార్టీ పూర్తి సహాయ సహకారాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నేతల ఇళ్లపై ఐటీ దాడులు నిర్వహిస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో మీ ఉడత ఊపులకు భయపడే నాయకులు లేరని, కేవలం మరో 30 రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పులి సైదులు, ప్రధాన కార్యదర్శి ఆరెం కిరణ్, సర్పంచులు పాయం స్వాతి, పాయం లలిత, కల్తీ పద్మ, తాటి చుక్కమ్మ, ఎంపీటీసీలు మండల రాము, పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్, తాటి యశోద, ఉప సర్పంచులు నేలవెళ్ళి నరసింహారావు, తాటి రాంబాబు, వార్డు సభ్యులు ఊరుగొండ ధనుంజయ్ పాల్గొన్నారు.

పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య

దుమ్ముగూడెం : పురుగు మందు తాగి గిరిజన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం జడ్.వీరభద్రాపురం (కణితి వారి గుంపు) గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఇర్పా వీరయ్య - లక్ష్మీ దంపతులకు ముగ్గురు సంతానం. వీరిలో మృతుడు ఇర్పా జంపన్న (20) పెద్దవాడు. కాగా ఇద్దరు చెల్లెలు ఉన్నారు. పెద్ద చెల్లి మౌనికను అర్ కొత్తగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. మౌనికకు రెండు నెలల పాప ఉంది. కాగా పాప అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. జంపన్న ఆవేదనతో మద్యం సేవించి చనిపోయిన పాపని ఎత్తుకొని తిరుగుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు అలా ఎందుకు చేస్తున్నావని మందలించారు. దీంతో జంపన్న మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలి

• నామినేషన్ పత్రాలకు ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-వైరాటౌన్



వైరా నియోజకవర్గ కేంద్రంలోని శాస్త్రానగర్ అయ్యప్ప స్వామి దేవాలయం, స్నానాల లక్ష్మీపురం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయం, నెమలి వేణుగోపాల స్వామి దేవాలయంలో మధిర ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న సందర్భంగా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క దంపతులు, వైరా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాలోతు రాందాస్‌నాయక్ నామినేషన్ పత్రాలకు ప్రత్యేక పూజలు చేయించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో గెలుపొందాలని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎల్పీ నేత భట్టికి వైరాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ నాయకులు దాసరి దానియేలు, శీలం వెంకట నర్సిరెడ్డి, నాయుడు సత్యనారాయణ, రామపూడి రోశయ్య, సీతారాములు, పొదిలి హరినాథ్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ గెలుపు అభివృద్ధికి నాంది

- తుమ్మల గెలుపు కోసం 13వ డివిజన్‌లో మహిళల ప్రచారం

నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అభివృద్ధికి నాంది పలకాలని ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి బొట్టు పెట్టి కాంగ్రెస్ మహిళా కార్యకర్తలు గురువారం ప్రచారం నిర్వహించారు. నగర పరిధిలోని 13వ డివిజన్‌లో మాజీమంత్రి, కాంగ్రెస్ ఖమ్మం శాసనసభ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు గెలుపు కోసం మహిళా కార్యకర్తలు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో ఖమ్మం నియోజవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్న తుమ్మల చేసిన అభివృద్ధి పనుల గురించి గడపగడపకు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఏలూరి రవికుమార్, కట్టే కోల నాగలక్ష్మి, ప్రమీల, సఫియా, వరలక్ష్మి, నాగమణి, మంగతాయారు, డేవిడ్, రహీం, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులపై ఐటీ దాడులు సరికాదు

- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

నవతెలంగాణ-ఖమ్మం

ఎన్నికల ముంగిట ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులపై కేంద్ర, రాష్ట్ర సంస్థలు ఐటి దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేయటం సరికాదని సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో ఖండించారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్లు వేస్తున్న రోజునే పదుల సంఖ్యలో ఆయన కార్యాలయలు, బంధుమిత్రుల ఇండ్లపై సోదాలు, దాడులు చేయటం వారిని భయభ్రాంతులకు గురి చేయటం లక్ష్యంగా జరుగుతుందని తెలిపారు. ఎన్నికలను స్వేచ్ఛగా నిర్వహించుకోకుండా ఇబ్బందులకు గురి చేయటం సరి కాదని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలు దుర్మార్గమని పేర్కొన్నారు. ఈ చర్యలను తెలంగాణ సమాజం నిరసించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

నీలాద్రి ఈశ్వరుని దర్శించుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర

నవతెలంగాణ-పెనుబల్లి



పెనుబల్లి మండలంలోని భవనపాలెం అటవీ ప్రాంతంలో గల నీలాద్రి ఈశ్వరుని ఆలయాన్ని గురువారం బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకట వీరయ్య దర్శించుకున్నారు. గురువారం నామినేషన్ వేసే సందర్భంలో ముందస్తుగా నీలాద్రి ఈశ్వరుని పాదాల చెంత నామినేషన్ పత్రాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సండ్ర దంపతులు ఇరువురు పాల్గొని దర్శించుకున్నారు. పెనుబల్లి మండలం నుండి గురువారం నామినేషన్‌కు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.

విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-తల్లాడ

ఈనెల 11న హైదరాబాద్‌లో మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఇస్నేపల్లి అశోక్ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం మహాసభ పోస్టర్లను తల్లాడ జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడారు. విశ్వరూప మహాసభకు ప్రధానమంత్రి మోడీ హాజరవుతారని ఏబిసిడి వర్గీకరణ సాధించేందుకు విశ్వరూప మహాసభ కీలకంగా మారనున్నదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాదిగ మేధావులు ,ఉద్యోగులు, మాదిగ ఉపకలాలు, అధిక సంఖ్యలో మహాసభలకు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కోట బలరాం మాదిగ, అద్దంకి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనగరంలో అయ్యప్ప స్వామి విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని లక్ష్మీ నగరం గ్రామంలో గల శ్రీ దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో గురువారం జీరి సత్యనారాయణ గురుస్వామి అర్చకులు రాజగోపాలచార్యులు కన్నె స్వాములచే అయ్యప్ప స్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి గణపతి పూజ కలశ పూజ 40 మంది అయ్యప్ప దీక్ష పరులచే పంచామృతాలతో అభిషేకాలు అష్టోత్తర శతనామావళి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు అల్లాడి వెంకటేశ్వరరావు, వేముల శ్రీను, పూదోట శ్రీనివాసరావు, పంపన పవన్, కాకి భాస్కర్ రెడ్డి, పత్తివాడ జగదీష్,డింగి నాగేశ్వరరావు శివ, వంశి, కన్నె స్వాములు చింటూ, కరుణాకర్, ఎల్లోజి తో పాటు భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భారీ చేరికలు

నవతెలంగాణ-ఖమ్మం



ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి తుమ్మల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం ఖమ్మంలోని తుమ్మల క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇల్లందు, అశ్వరావుపేట, వైరా, ఖమ్మం నియోజకవర్గాలకు చెందిన ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఇల్లందు ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, మెట్ల శిరమణి, , పిఏసిఎస్ చైర్మెన్ ఇల్లందు మెట్ల కృష్ణ, జానీ, కాజా మియా, చింత రామయ్య, ఊకే.శ్రీను, నౌషద్, ఊకే కిరణ్, కుంజా సుధాకర్, ఊకే భద్రమ్మ, ఊకే రవి, జెక్కుల కృష్ణతో పాటు వైయస్సార్సీపి పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు రిటైర్డ్ సిఐ మద్దెల ప్రసాద్‌రావు, వైరా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీడీకే రత్నం, ఖమ్మం ప్రకాష్ నగర్‌లో టిడిపి నాయకులు, నార్ల నాగేశ్వరరావు, విజయలక్ష్మి, మొలుగూరి వెంకటమ్మ, అశ్వరావుపేట నియోజకవర్గం పట్వారి గూడెం గ్రామానికి చెందిన ముఖ్య నేతలు బొల్లికొండ నాగేశ్వరరావు, ఎస్కే.నజీర్, కొనకళ్ళ నాగబాబు, ఎం.సూరిబాబుతోపాటు గ్రామానికి చెందిన 50 కుటుంబాలు మాజీ మంత్రి, కాంగ్రెస్ ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ నీ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరిన ఇల్లందు, అశ్వరావుపేట, ఖమ్మం నియోజకవర్గ నాయకులందరూ కలిసికట్టుగా ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సాదు రమేష్‌రెడ్డి, బిక్కసాని నాగేశ్వరావు, మిక్కిలినేని నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక రంగం సేవలు సులభతరం

- ఎకనామిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యప్రకాష్

నవతెలంగాణ-ఖమ్మం



వేగవంతంగా మారుతున్న సమాజంలో కీలకమైన ఆర్థిక రంగంలో సేవలు సులభతరమయ్యాయని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఈ.సత్యప్రకాష్ అన్నారు. గురువారం ఖమ్మంలోని ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ కళాశాల కామర్స్ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ హయ్యర్ ఎడ్యుకేషన్ సౌజన్యంతో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా అధ్యక్షతన ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్ ఇండియా -ఎమర్జింగ్ ఇష్యూస్ అండ్ ఛాలెంజెస్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ఫైనాన్షియల్ ఇన్వెస్ట్‌మెంట్ పెరిగిందన్నారు. . కాకతీయ విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్మెంట్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కట్లరాజేందర్ కీలకోపన్యాసం చేస్తూ, దశాబ్ది కాలంగా ఇన్సూరెన్స్, మైక్రోఫైనాన్స్, డిజిటల్ బ్యాంకింగ్ రంగంలో వేగవంతంగా మార్పులు జరిగాయని తెలిపారు. అనంతరం ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాల, కేడీసీ హన్మకొండ, మరిపెడ, జోగిపేట, మహబూబాబాద్ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ పద్మావతి, డాక్టర్ చిన్న అప్పయ్య, డాక్టర్ రాజిరెడ్డి, డాక్టర్ కవిత, డాక్టర్ రమేష్, డాక్టర్ రాజు, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు జే.నాగేశ్వరరావు మాట్లాడారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి సెమినార్ సావనిర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బివి.రెడ్డి, సదస్సు కన్వీనర్, కామర్స్ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగాధిపతి డాక్టర్ పి.సర్వేశ్వరరావు, ఐ.క్యూ.ఏ,సి కోఆర్డినేటర్ డాక్టర్ రమాసత్యవతి, కామర్స్ శాఖఅధ్యాపకులు డాక్టర్ బ్రహ్మం, శ్రీనివాస్, స్వామి, రమేష్, డివి.రమణ, సేత్రాం, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మేడేపల్లి హైస్కూల్ విద్యార్థులు

నవతెలంగాణ-ముదిగొండ



ఖమ్మం అర్బన్ మండలం వివిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఫుట్‌బాల్ అండర్ 14 బాల బాలికలు, అండర్ 17 బాలికల జట్ల ఎంపికల పోటీల్లో మేడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాల బాలికలు పాల్గొని సత్తా చాటారు. రాష్ట్రస్థాయి ఫట్‌బాల్ ఛాంపియన్షిప్‌కు ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల పిఈటి బియ్యని కృష్ణయ్య గురువారం తెలిపారు. అండర్ 14 విభాగంలో బాలికల జట్టులో డి.పావని, కె.లావణ్య, (ఎనిమిదో తరగతి), అండర్ 17 విభాగంలో పి.యామిని (పదవతరగతి), ఎం.యువవర్షిని (9వతరగతి), బి.కావ్య (8వతరగతి), అండర్ 14 బాలుర విభాగంలో జి. ప్రణయ్‌లు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫుట్‌బాల్ ఛాంపి యన్షిప్‌కు ఎంపిక కావడం విశేషం. రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ ఛాం పియన్షిప్ పోటీలకు ఎంపికైన ఆరుగురు క్రీడాకారులను పిఈ టి బియ్యని కృష్ణయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి నాగేశ్వరరావు, ఎంపిపి సామినేని హరిప్రసాద్, గ్రామసర్పంచ్ సామినేని రమేష్, ఎస్ఎంసి చైర్మన్ సమత సీనియర్ క్రీడాకారుడు సామినేని శంకర్‌రావు, ఉపాధ్యాయులు వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

మైనర్‌ను వేధించిన కేసులో వ్యక్తికి జైలు

నవతెలంగాణ-కారేపల్లి

మైనర్ బాలికను లైగింకంగా వేధింపులకు గురిచేసిన కేసులో కారేపల్లికి చెందిన వ్యక్తికి 3 ఏండ్ల జైలు, రూ.20 వేల జరిమాన విధిస్తూ జిల్లా పస్టక్లాస్ అడిషనల్ కోర్టు జడ్జీ కే.ఉమాదేవి గురువారం తీర్పు చెప్పినట్లు కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు తెలిపారు. 13 మే2021 కారేపల్లికి చెందిన అంగడి రామకృష్ణ తన ఇంటి అవరణంలో అడుకుంటున్న బాలికపై లైగింక వేధింపులకు పాల్పడ్డాడు. విషయం బాలిక తల్లికి తెల్పటంతో రామకృష్ణ పై బాధితురాలి తల్లి కారేపల్లి పోలీసులకు పిర్యాదు చేసింది. దీనిపై అప్పటి ఎస్సై పీ.సురేష్ ఫోక్సో కేసు నమోదు చేశారు. దీనిపై విచారించిన జడ్జి నేరం రుజువు కావటంతో నిందితునికి జైలు శిక్ష, జరిమాన విధించినట్లు ఎస్సై తెలిపారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కొత్త వెంకటేశ్వర్లు బాధితురాలు తరుపున వాధించగా లైజన్ ఆఫీసర్ వీ.భద్రునాయక్, కోర్టు కానిస్టేబల్ టీ.వెంకటేశ్వరరావు, హెూంగార్డు ఆయుబ్‌లు సహకరించారు.

రేపు ఎమ్మార్పీఎస్ విశ్వరూప మహాసభ

నవతెలంగాణ-ముదిగొండ

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్పి) వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభ నిర్వహించినట్లు ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి కొలికపొంగు వెంకట్రావు మాదిగ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యఅతిథిగా హాజరయ్యే సభకు మండలంలోని వివిధ గ్రామాల నుండి మాదిగ జాతి ప్రజలు, విద్యార్థులు, యువతి, యువకులు అధికసంఖ్యలో హైదరాబాద్‌కు తరలివెళ్లి విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

ఏటీఏ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఏటీఏ) 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీ నగరంలో జరిగిన కార్యక్రమంలో జెండాను ఏటీఏ రాష్ట్ర అధ్యక్షులు కల్లూరు జయ బాబు పాల్గొని జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండల అధ్యక్షులు వాసం ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జయబాబు మాట్లాడారు. భవిష్యత్తులో నిర్వహించే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ఏజెన్సీ మైదాన ప్రాంతాలుగా వర్గీకరించి ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక షెడ్యూల్ ట్రైబల్స్ మాత్రమే పదోన్నతులు కల్పించాలని, జాతి అభివృద్ధి కోసం ప్రతి ఆదివాసి ఉపాధ్యాయులు ఏటీఏ సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుర్సం రవి (ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు) ఏటీఏ నాయకులు మచ్చ బాబురావు కారం శ్రీనివాసరావు, సవలం శ్రీనివాసు, చీమల నంగయ్య, పోలెబోయిన మధుబాబు, కుర్సం వినోద్ బాబు, కుర్సం రాంబాబు, సోందే భద్రమ్మ, అపక సుశీల, కుర్సం లక్ష్మణ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు : ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు స్థానిక హనుమాన్ టెంపుల్ కూడలిలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలో భాగంగా ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చీమల సత్యం ఏటీఏ జెండా ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా, మండల బాధ్యులు జిమ్మా వెంకటేశ్వర్లు, కోరెం శ్రీనివాసరావు, మెస్సు బక్కయ్య, రవిబాబు, రంగారావు, అచ్చయ్య, నాగేశ్వరరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్‌కు బయలుదేరిన కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి వెంకట ప్రవీణ్ కుమార్ నాయక్

నవతెలంగాణ-కామేపల్లి

కామేపల్లి మండలం నుండి కాంగ్రెస్ పార్టీ రెబెల్ అభ్యర్థిగా నామినేషన్‌కు బానోతు వెంకట్ ప్రవీణ్ కుమార్ నాయక్ భారీ మోటార్ సైకిల్ ర్యాలీతో గురువారం బయలుదేరారు. కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన వారిని గుర్తించకుండా పార్టీలు మారే వారికి అవకాశం కాంగ్రెస్ పార్టీ ఇవ్వడంతో విరక్తి చెంది కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా నియోజకవర్గంలో పోటీ చేసేందుకు తాను నామినేషన్‌కు బయలుదేరినట్టు, తమ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయడానికి సిద్ధంగా ఉన్నారని ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శంకర్, ప్రేమ్, ప్రవీణ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.